PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 75 | విజయవాడ, బుధవారం 15 అక్టోబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 15 October 2025 | Rs

పర్వతారోహణలో కర్నూలు యువకుడి రికార్డు



- ప్రపంచంలోని టాప్-9 శిఖరాల అధిరోహణ
- దేశంలోనే తొలి వ్యక్తిగా ఘనత

2



టీమిండియా క్లీన్‌స్వీప్

- రెండోటెస్ట్‌లో వెస్టిండీస్‌పై ఏడు వికెట్ల తేడాతో గెలుపు
- సిరీస్ 2-0తో కైవసం

8

విశాఖకు గూగుల్

- ఎఐ హబ్ ఏర్పాటుకు ఒప్పందం
- ఐదేళ్లలో రూ.1,33,000 కోట్ల పెట్టుబడులు
- ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఎంఒయు
- ఒప్పందం పట్ల ప్రధాని మోడీ హర్షం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో/ అమరావతి

ప్రతిష్టాత్మక సాఫ్ట్‌వేర్ సంస్థ గూగుల్ విశాఖకు రానుంది. ఈ మేరకు విశాఖలో భారీ ఎఐ హబ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. న్యూఢిల్లీలోని తాజ్‌మాన్ సింగ్ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, గూగుల్ సంస్థ ప్రతినిధులు అవగాహన ఒప్పంద (ఎంఒయు) పత్రాలు మార్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం ఒక్క గిగావాట్ సామర్థ్యంతో గూగుల్ సంస్థ విశాఖలో ఎఐ హబ్‌ను ఏర్పాటు చేయనుంది. దీనికోసం ఐదేళ్లలో రూ.1,33,000 కోట్ల పెట్టుబడులను ఆ సంస్థ పెట్టనుంది. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్, గూగుల్ క్లౌడ్ గ్లోబల్ సిఇఒ థామస్ కురియన్, బికాష్ కొలే (వైస్ ప్రెసిడెంట్, గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్), కరణ్ బజ్వా (ప్రెసిడెంట్, ఏషియా పసిఫిక్ గూగుల్ క్లౌడ్) తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా థామస్ కురియన్ మాట్లాడుతూ అమెరికా తరువాత ప్రపంచంలోనే తమ సంస్థ నిర్మించే అతి పెద్ద ఎఐ హబ్‌గా విశాఖపట్నం యూనిట్ నిలుస్తుందన్నారు. ప్రారంభంలో 1 గిగావాట్ సామర్థ్యంతో దీనిని ఏర్పాటు చేస్తామని, సమీప భవిష్యత్తులోనే మరిన్ని గిగావాట్లకు విస్తరిస్తామని తెలిపారు. 12 దేశాలల్లోని ఎఐ సెంటర్స్ నెట్‌వర్క్‌లో భాగంగా విశాఖ ఎఐ హబ్ ఉంటుందన్నారు. దీనిద్వారా విశాఖ ప్రపంచ స్థాయి కనెక్టివిటీ హబ్‌గా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇందుకోసం విశాఖను భూతల కేంద్రంగా చేసుకొని సముద్రగర్భ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సబ్ సి కేబుల్ నెట్‌వర్క్‌ను అంతర్జాతీయ నెట్‌వర్క్‌కు కనెక్ట్ చేసి, దేశంలోని వివిధ ప్రాంతాల్లోని డిజిటల్ ఆధారిత వ్యవస్థలతో



గూగుల్‌తో ఒప్పందం సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులతో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వనీ కుమార్ వైష్ణవ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్

అనుసంధానిస్తామని పేర్కొన్నారు. ఎఐ టెక్నాలజీతో పాటుగా డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను కూడా అందిస్తామని, ఎఐ హబ్‌లో పూర్తి సాంకేతిక పరిష్కారాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. స్థానికంగా డేటాను స్టోర్ చేసి సావరిన్ ఎఐ అవసరాలు తీర్చేలా ఎఐ హబ్ పని చేస్తుందని, జెమిని, ఇమేజెన్ విఒ, ఇంకా గూగుల్ ఎఐ మోడళ్ళన్నింటితో పాటు యాప్ డెవలప్‌మెంట్ కోసం అవసరమైన ఎఐ ప్లాట్‌ఫామ్‌లను హబ్ అందిస్తుందన్నారు. దేశంలోని ఐదు గూగుల్ కేంద్రాల్లో ప్రస్తుతం 14 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు.

ప్రతి కుటుంబానికి చేరువగా ఎఐ : చంద్రబాబు

ప్రతి కుటుంబానికి కృత్రిమ మేథ ఫలాలను చేరువగా తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. గతంలో హైదరాబాద్ హైటెక్ సిటీని అభివృద్ధి చేశామని, ఇప్పుడు విశాఖను ఐటి హబ్‌గా తీర్చిదిద్దుతామని ఆయన చెప్పారు. నాడు హైదారాబాద్‌కు మైక్రోసాఫ్ట్ వచ్చినట్లుగానే నేడు విశాఖకు గూగుల్‌ను తీసుకొస్తున్నామని అన్నారు. సాంకేతికతలో నూతన ఆవిష్కరణలు వస్తున్నాయని, డిజిటల్ కనెక్టివిటీ, డేటా సెంటర్, ఎఐ, రియల్‌టైమ్ డేటా కలెక్షన్లు ముఖ్యమైనవని అన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో రాష్ట్రం ముందుందని తెలిపారు. హార్డ్ వర్క్ కాదు, స్మార్ట్ వర్క్ నినాదం తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఐదేళ్లలో గూగుల్ 15 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడతామనడం సంతోషదాయకమని అన్నారు. కొత్త ఆవిష్కరణలను అందిపుచ్చుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం ముందుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. సాంకేతికత ప్రపంచాన్నే మార్చేస్తోందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. ఈ రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయన్నారు.

ప్రపంచ వేదికపై విశాఖ : నారా లోకేష్

విశాఖ ఎఐ హబ్ కేవలం ఆంధ్రప్రదేశ్, గూగుల్‌కే కాదని, యావత్ భారతదేశానికి చరిత్రాత్మకమైందని రాష్ట్ర ఐటి మంత్రి నారా లోకేష్ అన్నారు. గూగుల్ డేటా సెంటర్ గ్రామీణ స్థాయిలో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి, విస్తృత సేవలను అందిస్తుందన్నారు. విశాఖపట్నం ఎఐ హబ్ దేశానికి, రాష్ట్రానికే గాక ప్రపంచ వేదికపై ఎఐ రంగంలో భారత్ కీలకపాత్ర పోషించేలా అభివృద్ధి చెందుతుందన్నారు. డేటా ఇంధనం అయితే, డేటా సెంటర్లు రిఫైనరీలు వంటవని ఆయన అభివర్ణించారు. 12 నెలల్లో మిగతా 6లో

పేదలపై భారాన్ని మోపే విద్యుత్ బిల్లును ఉపసంహరించాలి

- సిఐటియు డిమాండ్

న్యూఢిల్లీ : పేదలపై భారాన్ని మోపే ముసాయిదా విద్యుత్ సవరణ బిల్లు 2025ను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిఐటియు డిమాండ్ చేసింది. ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని, విద్యుత్ హక్కును పరిరక్షించుకోవాలని విజ్ఞప్తి చేసింది. విద్యుత్ సవరణ బిల్లును సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. 2014నుండి ఈ సవరణ బిల్లును అనేక రూపాల్లో మార్చి మార్చి తీసుకువస్తూ అమలు చేయడానికి ప్రయత్నించి మోడీ ప్రభుత్వం విఫలమవుతూ వచ్చింది. అయినా మరోసారి మోడీ సర్కార్ మళ్ళీ సంస్కరణల పేరుతో అదే ప్రక్రియను పునరావృతం చేస్తోందని సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'గతంలోని ముసాయిదాల కన్నా 2025 ముసాయిదా బిల్లును మరింత తీవ్ర రూపంలో తీసుకువచ్చారు. భారత విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించడానికి, వాణిజ్యపరం చేయడానికి, కేంద్రీకృతం చేయడానికి ఈ బిల్లు ఉద్దేశించింది. దీనివల్ల ప్రభుత్వ సంస్థలకు, వినియోగదారుల హక్కులకు, సమాఖ్యవాదానికి, లక్షలాది విద్యుత్ సిబ్బంది జీవనోపాధులకు తీవ్రమైన ముప్పు పొంచి వుంది. ఈ బిల్లును అమలు చేసినట్లైతే దశాబ్దాలుగా నిర్మించుకుంటూ వచ్చిన సమగ్ర, సామాజిక ఆధారిత విద్యుత్ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోతుంది' అని ఆయన హెచ్చరించారు. ఈ బిల్లుతో లాభదాయకమైన విభాగాలను ప్రైవేటు కార్పొరేషన్లకు కట్టబెట్టి, రాష్ట్ర డిస్కామ్‌లపై నష్టాలు, సామాజిక బాధ్యతలు రుద్దుతారని విమర్శించారు. ఐదేళ్ళలోగా క్రాస్ సబ్సిడీలను తొలగించాలన్న ప్రతిపాదన వల్ల ప్రభుత్వ సంస్థలకు పెద్ద ఎత్తున నష్టాలు సంభవిస్తాయన్నారు. పేదలకు, గ్రామీణ వినియోగదారులకు టారిఫ్‌లు భరించరానివిగా మారతాయన్నారు. క్రాస్ సబ్సిడీ అనేది సామాజిక ఆవశ్యకత అని అంతేకానీ అసమర్థత కాదని ఆయన వ్యాఖ్యానించారు. దీన్ని తొలగించడం వల్ల రైతులు, కార్మికుల్లో అసమానతలు పెరిగిపోతాయని, అశాంతి నెలకొంటుందని హెచ్చరించారు. విద్యుత్ ఉత్పత్తి నుండి పంపిణీ వరకు మిగతా 7లో

కాకినాడ సెజ్ అవార్డు భూములు తిరిగి రైతులకే

- రిజిస్ట్రేషన్ రుసుము, స్టాంప్ డ్యూటీ మినహాయింపు ప్రభుత్వం ప్రకటన
- మిగిలిన భూముల మాటేమిటి?

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో, కాకినాడ ప్రతినిధి

కాకినాడ సెజ్ పేరుతో రైతుల నుంచి బలవంతంగా లాక్కొన్న భూముల్లో కొన్నింటిని తిరిగి వారికే రిజిస్ట్రేషన్ చేసి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఆయా భూముల రిజిస్ట్రేషన్లకు రిజిస్ట్రేషన్ ఛార్జీలు, స్టాంప్ డ్యూటీలు వసూలు చేయకూడదని పేర్కొన్నారు. 2,180 ఎకరాలను ప్రభుత్వం వెనక్కి ఇవ్వడం ద్వారా ఉప్పాడ, కొత్తపల్లి, తొండంగి మండలాల పరిధిలో 1,551 మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని ఆమె తెలిపారు. కాకినాడ సెజ్‌కు భూములు ఇవ్వడానికి కొందరు రైతులు వ్యతిరేకించారు. అయినా, ప్రభుత్వం వారి నుంచి బలవంతంగా భూములను లాక్కొంది. ఈ భూములకు సంబంధించిన నష్టపరిహారాన్ని బ్యాంకులో జమ చేసింది. అయినా, ఆ డబ్బులను రైతులు తీసుకోలేదు. దీంతో, వీరికి సంబంధించిన భూములను తిరిగి వారికి అప్పగించాలని గత వైసిపి ప్రభుత్వం నిర్ణయించి జిఒ 12 విడుదల చేసింది. ఈ మేరకు 986 ఎకరాలకు గత ప్రభుత్వంలోనే రిజిస్ట్రేషన్ పూర్తయింది. 1,551 మంది రైతులకు చెందిన మిగిలిన 1,194 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరగలేదు. ఈ సమస్యను ఇటీవల శాసన మండలిలో సమావేశాల్లో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. గతంలో ఇచ్చిన మేరకు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ స్పందించారని, సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారని జనసేన వర్గాలు పేర్కొన్నారు. కాకినాడ సెజ్ రైతులకు ఊరట కలిగించేలా నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. కాకినాడ సెజ్ పరిధిలోని అవార్డు భూములు కలిగిన రైతులకే తిరిగి భూములను అప్పగిస్తున్నారు.

మిగిలిన భూముల పరిస్థితి ఏమిటి?

మిగిలిన భూముల పరిస్థితిపై ప్రభుత్వం మాట్లాడట్లేదు. కాకినాడ సెజ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను 2003లో ప్రారంభించారు. ప్రస్తుతం దీనికింద 10,500 ఎకరాలు ఉన్నాయి. కేంద్రం 2,587.50 ఎకరాల పరిధి మేరకు మాత్రమే కాకినాడ సెజ్‌కు అనుమతులిచ్చింది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం 5,120 ఎకరాలను రైతుల నుంచి బలవంతంగా తీసుకుంది. వీటితోపాటు యు.కొత్తపల్లి మండలానికి చెందిన వివిధ గ్రామాల పరిధిలో 2,295 ఎకరాలు, తొండంగి మిగతా 2లో

ఖాళీగా ఉన్న భూములన్నింటినీ తిరిగి ఇచ్చేయాలి



అప్పట్లో మా కుటుంబం నుంచి ప్రభుత్వం ఎనిమిది ఎకరాల భూములను సెజ్ కోసం తీసుకుంది. పిల్లలకు స్థానికంగానే ఉద్యోగావకాశాలు వస్తాయనే కారణంతో తప్పనిసరి పరిస్థితుల్లో భూములను ఇచ్చాము. ఇక్కడ పరిశ్రమలు రాలేదు. భూములన్నీ ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. అవార్డు భూములనే తిరిగి ఇస్తున్నారు. మాలాంటి కుటుంబాలు ఇక్కడ చాలా ఉన్నాయి. ఖాళీగా ఉన్న భూములను అన్నింటినీ సంబంధిత రైతులకు బేషరతుగా తిరిగి అప్పగించాలి.

– అబ్బిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, రమణక్కపేట, యు. కొత్తపల్లి మండలం



రాజస్తాన్‌లో ఘోరం

- బస్సులో మంటలు చెలరేగి 20 మంది సజీవదహనం

జైపూర్ : రాజస్తాన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. జైసల్మేర్ నుంచి జోధ్‌పూర్ వైపు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సులో భారీగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 20 మంది సజీవదహనం కాగా.. 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 57 మంది ప్రయాణీకులు ఉన్నారు. జైసల్మేర్ నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ప్రైవేటు బస్సు జోధ్‌పూర్‌కు బయలుదేరింది. జైసల్మేర్‌లో బయలుదేరిన కొద్ది సేపటికే, అంటే దాదాపు 20 కిలోమీటర్ల దూరంలోని థాయత్ గ్రామ సమీపానికి చేరుకోగానే బస్సు వెనక భాగంలో ఒక్కసారిగా చెలరేగిన మంటలు.. క్షణాల్లోనే బస్సంతా వ్యాపించాయి. దీంతో బస్సును నిలిపి వేసిన డ్రైవర్.. ప్రయాణికులను అప్రమత్తం చేశాడు. మరోవైపు వెంటనే స్పందించిన స్థానికులు, ఇతర వాహనదారులు ఫైర్ సిబ్బందిని అప్రమత్తం చేయడంతోపాటు సహాయక చర్యలు చేపట్టారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక బృందాలు బస్సులో మంటలను అర్పివేశాయి. అయినా బస్సు 80 శాతం మిగతా 7లో



మావోయిస్టు అగ్రనేత మల్లోజుల లొంగుబాటు

- మరో 60 మందితో కలిసి జనజీవనస్రవంతిలోకి.. 7లో


పట్టపగలు నడిరోడ్డుపై వ్యక్తి దారుణ హత్య



- స్కూటీపై వచ్చి కత్తితో పొడిచి పరారైన దుండగుడు 3లో

బిజెపి పాలనలో రక్షణ కరువు

- మనువాదానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త పోరాటం
- 13 గంటల పని అమానవీయం
- ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే



మహాసభలో మాట్లాడుతున్న ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

బిజెపి పాలనలో మహిళలకు ఏ మాత్రమూ రక్షణ లేకుండా పోయిందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే ఆందోళన వ్యక్తం చేశారు. రెండు రోజులుగా జరుగుతున్న ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలో పాల్గొనేందుకు ఆమె అనంతపురం విచ్చేశారు. లక్ష్మీసెహగల్ ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ధావలే మాట్లాడారు. బిజెపి అధికారంలోకి వచ్చాక మహిళలపై దాడులు పెరిగాయని వివరించారు. ఈ దాడుల్లో బాధితుల కంటే నిందితులకే ప్రభుత్వ సహకారం ఉంటోందని విమర్శించారు. హత్రాస్ కేసులోని నిందితులందరూ ఇప్పుడు బెయిల్‌పై విడుదలై ఉన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. మహిళలపై నమోదైన కేసుల్లో కేవలం 27 శాతం కేసుల్లోనే నిందితులకు శిక్షలు పడుతున్నాయని, ప్రభుత్వ సహకారంతోనే ఈ కేసులు అత్యధికం నిర్వీర్యం అవుతున్నాయని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలోని అన్ని రంగాలనూ అంబాని, అదానిలకు కట్టబెడుతోందన్నారు. అన్నింటినీ ప్రయివేటీకరించడం వల్ల రిజర్వేషన్లు అమలుకు నోచుకోవడం లేదని తెలిపారు. తద్వారా ఎక్కువగా నష్టపోతున్నది మహిళలేనని వివరించారు. దీనివల్ల నిరుద్యోగం సైతం పెరుగుతోందని, ఆదాయాలు తగ్గి తప్పనిసరి పరిస్థితుల్లో అప్పులు చేయాల్సి వస్తోందని తెలిపారు. దీన్ని అవకాశంగా తీసుకుని మైక్రో ఫైనాన్స్ సంస్థలు ప్రజల నుంచి 24 శాతం నుంచి 200 శాతం వరకు వడ్డీ వసూలు చేస్తున్నాయన్నారు. కట్టలేని వారిపై ఒత్తిడి పెంచడంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ఇందులో అత్యధికం మహిళలే బాధితులుగా ఉన్నారని వివరించారు. పని గంటలను పెంచేస్తూ తీసుకున్న నిర్ణయం కూడా మహిళలకు ప్రతికూలమన్నారు. వారి ఆరోగ్యాలపైనా ఎక్కువ ప్రభావం ఉంటోందని మిగతా 5లో

మహిళా సమస్యలపై సుదీర్ఘ చర్చలు

- రెండవ రోజు చైతన్యభరితంగా సాగిన ఐద్వా రాష్ట్ర మహాసభ

2

కార్పొరేట్ల గుప్పెట్లో పచ్చని భూములు

- కర్నూలు జిల్లాలో ఇప్పటికే 20 వేల ఎకరాలు వారి చేతుల్లో
- మరో 15 వేల ఎకరాలు కట్టబెట్టేందుకు ప్రభుత్వం సన్నాహాలు



సోలార్ పరిశ్రమకు బలవంతంగా సేకరిస్తున్న కర్నూలు జిల్లా ఆలూరు మండలం మనేకుర్తి గ్రామంలో పత్తిసాగు చేసిన భూమి

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

అభివృద్ధి, ఉద్యోగాలు, ఉపాధి పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పచ్చని పంట పొలాలను కార్పొరేట్లకు కట్టబెడుతున్నాయి. కర్నూలు జిల్లాలో 2015 నుంచి ఇప్పటికే 20 వేల ఎకరాలు వారి గుప్పిట్లోకి వెళ్లిపోయాయి. మరో 15 వేల ఎకరాలను కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. 2015లో గడివేముల మండలం ఘని, శకునాల గ్రామాల పరిధిలో కర్నూలు అల్ట్రా మెగా సోలార్ పార్క్ పేరుతో ఆరు వేల ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ఈ ప్రాజెక్టును ఒక గిగావాట్స్ ఉత్పత్తి సామర్థ్యంతో ప్రారంభించారు. అయినా, స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వలేదు. డి-పట్టా భూములనే పేరుతో రైతులకు నష్టపరిహారం ఇవ్వకుండానే భూములు తీసుకోవాలని ప్రయత్నించింది. దీనికి వ్యతిరేకంగా సిపిఎం, రైతు సంఘాల పోరాటం ఫలితంగా అప్పటి టిడిపి ప్రభుత్వం చివరికి 1,800 మంది రైతులకు ఎకరాకు రూ.4.20 లక్షల చొప్పున పరిహారం అందించింది.

ఓర్వకల్లులోని జయరాజ్ ఇస్పాత్ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. ఈ ప్లాంట్ వల్ల ప్రత్యేక్షంగా 1,100 మందికి, పరోక్షంగా ఆరు వేల మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. రెండు వేల ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ఆ ప్లాంట్‌ను ఈ నెల 16న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించనున్నారు. ఇప్పటి వరకు సుమారు 3,200 మందికి ఉపాధి కల్పించినట్టు చెబుతున్నారు. అదే మండలంలోని నన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలో డ్రోన్ హబ్ కోసం సుమారు 300 ఎకరాలను ప్రభుత్వం బలవంతంగా లాక్కొంది. దీని నిర్మాణ పనులకు ప్రధాని మోడీ ఈ నెల 16న శంకుస్థాపన చేయనున్నారు. 2018లో ఓర్వకల్లు మండలం గుమ్మితం తండా, పాణ్యం మండలం పిన్నాపురం ప్రాంతాల్లో గ్రీన్‌కో పేరుతో ఇంటిగ్రేటెడ్ పవర్ ప్రాజెక్టుకు ప్రభుత్వం 4,500 ఎకరాలను కటబెట్టింది. రైతులు సాగు చేసుకుంటున్న మిగతా 7లో

కంపెనీలు సేకరిస్తున్నవి	ఎకరాల్లో..
ఆలూరు సోలార్	5000
టాటా పవర్	1800

ఇప్పటికే కేటాయించినవి	ఎకరాల్లో..
గ్రీన్‌కో	4500
జయరాజ్ స్టీల్	2000
కర్నూలు మెగా సోలార్	6000



ఉత్తర కోస్తాలో మోస్తరు వర్షాలు

- భారత వాతావరణ కేంద్రం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రం, యానాం మీదుగా దిగువ ట్రోపో ఆవరణలో తూర్పు, ఈశాన్య గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలో బుధవారం ఉత్తర కోస్తా, యానాంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు ఒకట్రెండు చోట్ల సంభవించే అవకాశం ఉంది. భారీ వర్షాలు ప్రకాశం, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లాలో నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది.

గాజాలో ఆగని నరమేధం !

- తాజా కాల్పుల్లో తొమ్మిది మంది మృతి



దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్‌లో ఖారెం అబూ సలేమ్ క్రాసింగ్ వద్ద ఆహార పొట్లాలు తీసుకుంటున్న పాలస్తీనా వాసులు

గాజా : గాజాలో ఇక శాంతి నెలకొన్నట్లేనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించినా గాజాలో నరమేధం ఆగలేదు. మంగళవారం మళ్ళీ ఇజ్రాయిల్ సైన్యం కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో తొమ్మిది మంది పాలస్తీనియన్లు మరణించారు. గాజాలో కాల్పుల విరమణ తొలి దశలో భాగంగా సోమవారం బందీలు, పాలస్తీనా ఖైదీల విడుదల జరిగింది. ఈ సందర్భంగా ఇక గాజాలో శాంతి నెలకొన్నట్లేనని ట్రంప్ గాజా సదస్సులో ప్రకటించారు. అది జరిగి 24గంటలు కూడా గడవక ముందే మళ్ళీ కాల్పులు చోటు చేసుకున్నాయి. 28ఏళ్ళ పాలస్తీనా జర్నలిస్టు సలేహ్ అల్జాఫరావిని సైనికబలగాలు కాల్చి చంపాయి. గాజాలోని షుజయెవ ప్రాంతంలో ఈ కాల్పులు చోటు చేసుకున్నాయి.

శిథిలాల్లో నుండి 38మృతదేహాలు

గత 24గంటల్లో 44 మృతదేహాలను ఆస్పత్రికి తీసుకువచ్చినట్లు గాజా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. అలాగే 29మంది గాయపడ్డారని కూడా వెల్లడించాయి. 38మృతదేహాలను శిధిలాల దిబ్బల్లోంచి తొలగించారని ఆ వర్గాలు తెలిపాయి. ఇంకా అనేక మంది బాధితులు ఆ శిధిలాల్లో చిక్కుకుని వున్నారని పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో గాజా మృతులు 67,917కి చేరాయి. అలాగే ఇజ్రాయిల్ నుండి 45 మంది పాలస్తీనా ఖైదీల మృతదేహాలు కూడా తమకు అందాయని రెడ్‌క్రాస్ తెలిపింది. వారి మృతికి గల కారణాలను కనుగొనేందుకు పరీక్షలు చేయాల్సి వుంది.

సాధికారతపైనే శాంతి

గాజాను పాలించడానికి పాలస్తీనియన్లకు కల్పించే సాధికారతపైనే శాంతి ఆధారపడి వుంటుందని పాలస్తీనా ప్రధాని మహ్మద్ ముస్తఫా వ్యాఖ్యానించారు. దాడులు ఒక్కటి ఆపేస్తే ఈ విషాదం ముగియదని ఆయన పేర్కొన్నారు. గాజాను పాలించుకునేందుకు పాలస్తీనా ప్రభుత్వానికి పూర్తి సాధికారతను కల్పించినపుడు మాత్రమే శాంతి సుస్థిరతలు నెలకొంటాయని ఆయన స్పష్టం చేశారు.

పే స్కేల్ సాధనకు ఉధృత పోరాటాలు

విఆర్‌ఎలకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విఆర్‌ఎల పే స్కేల్ జీతాల సాధనకు పోరాటాలు ఉధృతం చేయాల్సిన సమయం ఆసన్నమైందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. ఏపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం(గ్రామ సేవకుల సంఘం) రాష్ట్ర క మిటీ ఆధ్వర్యంలో విజయవాడ అలంకార్ సెంటర్ ధర్నా చౌక్‌లో రెండో రోజు మంగళవారం రిలే నిరాహారదీక్షా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగా జీతాలు పెరగకపోవడంతో విఆర్‌ఎల కుటుంబాలు ఆర్థికంగా కాలం వెళ్లదీస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా పనిచేస్తున్న విఆర్‌ఎలకు పే స్కేల్ జీతాలు చెల్లించి వారి కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప విఆర్‌ఎల జీవితాల్లో మార్పులు రావడం లేదన్నారు. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే విఆర్‌ఎల జీతాలు పెంచుతామని సిఎం చంద్రబాబునాయుడు ప్రతిపక్ష నేత హోదాలో ఇచ్చిన హామీని ఆయన గుర్తుచేశారు. విఆర్‌ఎలు న్యాయమైన డిమాండ్ల కోసం చేస్తున్న పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి 15 నెలలైనా నేటికీ విఆర్‌ఎలకు జీతాలు పెంచలేదని ఆయన విమర్శించారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా విఆర్‌ఎలతో చేయిస్తున్న నైట్ డ్యూటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న విఆర్‌ఓ, రికార్డు అసిస్టెంట్, అటెండర్, నైట్ వాచ్‌మెన్ పోస్టులను భర్తీ చేయాలని, నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించకుండా పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతిరావు, కోశాధికారి రవికుమార్ మాట్లాడుతూ ఈనెల 15న విజయవాడలో చేపట్టనున్న రాష్ట్ర స్థాయి ధర్నాకు విఆర్‌ఎలు పెద్దఎత్తున తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



ధర్నా చౌక్‌లో రిలే నిరాహారదీక్షా శిబిరంలో సంఘీభావం తెలుపుతున్న వి.ఉమామహేశ్వరరావు

మహిళా సమస్యలపై సుదీర్ఘ చర్చలు

- రెండవ రోజు చైతన్యభరితంగా సాగిన ఐద్వా రాష్ట్ర మహాసభ
- చర్చలు..సౌహార్థ సందేశాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మహిళా సమస్యలపై ఐద్వా రాష్ట్ర మహాసభలో సుదీర్ఘ చర్చలు జరిగాయి. రాష్ట్ర కార్యదర్శి రమాదేవి ప్రవేశపెట్టిన నివేదికపైనే కాకుండా ఆయా జిల్లాల్లో మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలతోపాటు, వాటి పరిష్కారానికి ఐద్వా సాగించిన పోరాటాలను తెలియజేశారు. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రంలో మహిళల పరిస్థితులను తన నివేదికలో రమాదేవి సమగ్రంగా పేర్కొన్నారు. రాజకీయంగానూ మహిళల ప్రాధాన్యత తగ్గుతూ వస్తోందని, 27 శాతమే మహిళల ప్రాధాన్యత భారత పార్లమెంటులో ఉందని వివరించారు. రాష్ట్రంలో మద్యం, మైక్రోఫైనాన్స్ ఉచ్చులో చిక్కుకుని మహిళలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వీటన్నింటిపైనా రాబోయే రోజుల్లో ఉద్యమించాల్సిన అవసరముందని నివేదికలో పేర్కొన్నారు. నివేదిక అనంతరం ఐద్వా జాతీయ కార్యదర్శి మరియం ధావలే మహాసభలో జరగాల్సిన చర్చలపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో ఐద్వా పనితీరు మెరుగ్గా ఉందని, అయితే ఇప్పుడున్న బలం ఏ మాత్రమూ సరిపోదని, వచ్చే మహాసభ నాటికి రెండింతల బలం పెంచుకోవాల్సిన అవసరముందని సూచించారు. అందుకు క్షేత్ర స్థాయిలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని వారికి అండగా నిలిచి, పోరాడాల్సిన అవసరముందని చెప్పారు.

తమ తమ జిల్లాల్లో ఐద్వా చేపట్టిన ఉద్యమాలను వివరించడమే కాకుండా, మహిళలు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా ప్రతినిధులు ప్రస్తావించారు.

'ఎక్కడమ్మా నీవులేనిది' పుస్తకావిష్కరణ

రచయితలు, కవులు రాసిన కథలు, కవితలతో రూపొందించిన 'ఎక్కడమ్మా నీవులేనిది' పుస్తకాన్ని ఐద్వా ప్రతినిధుల విడుదల చేశారు. కేరళ మాజీ మంత్రి శ్రీమతి టీచర్ చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ ప్రగతి అధ్యక్షతన నిర్వహించిన కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమంలో కవితా సంపుటి రూపకర్త ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. మహిళలకు సమాన హక్కులు.. సమాన జీవనం ఉండే ఆధునిక భారతదేశ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాకవి ఏలూరి ఎంగన్న, రచయితలు జూటూరి షరీఫ్, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

లలిత కళాపరిషత్ కమిటీ వారు రూపొందించిన నాటికను ప్రదర్శించారు. 'అమ్మకు పట్టాభిషేకం' పేరుతో ప్రదర్శించిన నాటిక సభికులను ఆకట్టుకుంది. మహిళా చైతన్యం పెంపొందించేలా చేసిన విద్యార్థినుల ప్రదర్శన, ఆయా జిల్లాల నుంచి మహాసభకు వచ్చిన ప్రతినిధుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



'ఎక్కడమ్మా నీవులేనిది' పుస్తకావిష్కరణలో పాల్గొన్న కవులు, రచయితలు, ఐద్వా నాయకులు

'స్ట్రెయిట్ కట్ ' సర్వే పూర్తి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

చీరాల - బాపట్ల మండలాల మధ్య ఉన్న ఈపురుపాలెం స్ట్రెయిట్ కట్ కాలువ ప్రాంతంలోని భూముల సర్వేను అధికారులు మంగళవారం పూర్తి చేశారు. సోమవారమే కొలతలు చేపట్టగా భూ సర్వే తప్పుగా ఉందంటూ మత్స్యకారులు అభ్యంతరం చెప్పారు. దీంతో సర్వే నిలిచిపోయింది. సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ వాడరేవు వచ్చిన సమయంలో మత్స్యకారులు ఆయన్ను కలిశారు. భూముల సర్వేకు మత్స్యకారులు సహకరించాలని తాను న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం బాపట్ల ఆర్‌డిఒ పి.గ్లోరియా, ఎంఆర్‌ఒ సలీమా, డ్రైనేజి ఇఇ మురళీ కృష్ణ సమక్షంలో సర్వే చేపట్టారు. వివాదాస్పదమైన ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ సీ మౌత్ ప్రాంతాన్ని సర్వే చేసి హద్దులు నిర్ణయించి జెండాలు పాతారు. భూమి సర్వే చేసిన వివరాలు జిల్లా కలెక్టర్‌కి నివేదిస్తామని బాపట్ల ఆర్‌మొ గ్లోరియా తెలిపారు.

హైకోర్టు విషయమై ప్రధాని హామీ ఇవ్వాలి

- ఐలు డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలులో హైకోర్టు లేదా హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై ప్రధాని మోడీ స్పష్టమైన హామీ ఇవ్వాలని ఐలు డిమాండ్ చేసింది. ఐలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షులు సింగరాజు లక్ష్మణ్, న్యాయవాదులు జి.సామ్సన్, సి.ఆనంద్ మాట్లాడారు. ఈ నెల 16న కర్నూలుకు ప్రధాని నరేంద్ర మోడీ వస్తున్న సందర్భంగా హైకోర్టు విషయమై స్పష్టమైన హామీ ఇచ్చి నిర్మాణానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఐదేళ్లపాటు కాలం గడిపిందని, టిడిపి కూటమి కూడా ఆరు నెలల నుంచి హైకోర్టు, హైకోర్టు బెంచ్‌పై ప్రకటనలు తప్ప ఆచరణలో చేసిందేమీ లేదని విమర్శించారు. జిల్లా ప్రజల ఆకాంక్ష మేరకు రాష్ట్ర హైకోర్టు లేదా హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

రాష్ట్రానికి గ్రంథాలయం లేకపోవడం బాధాకరం

రాష్ట్రవ్యాప్తంగా ప్రజాశక్తి బుక్‌హౌస్‌ల ఏర్పాటుకు సన్నాహాలు

కెజి బుక్‌హౌస్ ప్రారంభోత్సవంతో పూర్వ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి - భీమవరం

గత తరాల ఆలోచనలు తెలుసుకోవడానికి ఈ తరానికి పుస్తకం ఎంతో దోహదపడుతుందని, మాటమీద నిలబడే మిత్రుడు పుస్తకమని మాజీ ఎంఎల్‌సి, ప్రజాశక్తి పూర్వ ఎడిటర్ ఎంవిఎస్.శర్మ అన్నారు. భీమవరంలోని సుందరయ్య భవనంలో కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు (కెజి) బుక్‌హౌస్‌ను ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తితో కలిసి ఆయన మంగళవారం ప్రారంభించారు. తొలుత కందుకూరి, గురజాడ చిత్రపటాలకు ఎంవిఎస్.శర్మ, ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ చైర్మన్ మంతెన సీతారాం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు బుక్‌హౌస్ కన్వీనర్ జి.రామలింగరాజు (మాస్టారు) అధ్యక్షత వహించారు. అనంతరం శర్మ మాట్లాడుతూ మానవత్వ విలువలను ప్రతిబింబించేదే సాహిత్యమని, దానిని బతికించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. జాతీయ ఉద్యమంలో గ్రామగ్రామాన గ్రంథాలయాలు నడిచాయని గుర్తు చేశారు. అయితే రాష్ట్రానికి గ్రంథాలయం లేకపోవడం బాధాకరమైన విషయమన్నారు. 1977 ఆగస్టు ఒకటో తేదీన ప్రజాశక్తి బుక్‌హౌస్‌ను ప్రారంభించిందని, 2026 ఆగస్టు ఒకటో తేదీకి 50 ఏళ్లు పూర్తి చేసుకుంటుందని తెలిపారు.



కెజి బుక్ హౌస్ ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ

భీమవరంలో బుక్‌హౌస్ ఏర్పాటు అభినందనీయం
ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

భీమవరం వంటి ప్రాంతంలో ఇప్పటి వరకు ఇలాంటి బుక్‌హౌస్ లేదని అన్నారు. ఇప్పుడు మహా గొప్ప రచయితల పేర్లతో భీమవరం పట్టణంలోనే బుక్‌హౌస్ నెలకొల్పడం అభినందనీయమని పేర్కొన్నారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా అధ్యయనం పెరగాలన్నారు. ఈ కార్యక్రమంలో బుక్‌హౌస్ కన్వీనర్ గాదిరాజు రామలింగరాజు, ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ చైర్మన్ మంతెన సీతారాం, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ చైర్మన్ బి.బలరాం, డిఎన్‌ఆర్ విద్యాసంస్థల మాజీ ప్రిన్సిపల్ జుత్తిగ చంద్రప్రసాద్, పుస్తక ప్రియులు, రచయిత పిఆర్‌కె.వర్మ, ఎస్‌ఆర్‌కెఆర్ కళాశాల డైరెక్టర్ మంతెన జగపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయాల అభివృద్ధికి చర్యలు

- ముఖ్యమంత్రికి సిపిఐ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల అభివృద్ధికి తక్షణమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిఎం చంద్రబాబుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మంగళవారం లేఖ రాశారు. యువత ఉపాధి కోర్సుల వైపు పయనించడంతో రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు. ఎందరో మహానుభావులను తీర్చిదిద్దిన విశ్వవిద్యాలయాల్లో పిజి కోర్సుల్లో చేరే విద్యార్థుల సంఖ్య నానాటికీ తగ్గిపోతుందన్నారు. సాంకేతిక విశ్వవిద్యాలయాలు మినహాయిస్తే ఇతర విశ్వవిద్యాలయాల్లో పిజి కోర్సుల్లో చేరే విద్యార్థులు అరకొరగా ఉన్నారని పేర్కొన్నారు. రాయలసీమలో ఒక వెలుగు వెలిగిన శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం 1981లో ప్రారంభమైందని, గతంలో ఇక్కడ పిజి కోర్సులు విపరీతమైన పోటీ ఉండగా, నేడు కేటాయించిన సీట్లలో 25 శాతం కూడా భర్తీ కావడం లేదన్నారు. విద్యార్థులు లేక చాలా వసతి గృహాలు మూతపడ్డాయని తెలిపారు. వర్సిటీలో 33 విభాగాలు ఉన్నాయని తెలిపారు. ఇంటర్ అనంతరం డిగ్రీలో చేరే విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో పిజి కోర్సులు చేసేవారు తగ్గిపోతున్నట్లు చెప్పారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అన్ని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఉపాధి సంబంధమైన నూతన కోర్సులను విశ్వవిద్యాలయాల్లో ప్రవేశపెట్టాలన్నారు.

గ్రామాల ముఖచిత్రం మారేలా పల్లె పండగ 2.0

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గతేడాది నిర్వహించిన పల్లె పండగ విజయవంతం కావడంతో ఈ ఏడాది అదే స్ఫూర్తితో పల్లె పండగ 2.0ను చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో త్వరలో చేపట్టనున్న పల్లె పండగ 2.0 కార్యక్రమంపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి, నూతన రహదారుల నిర్మాణం, మరమ్మతులు, గోశాలలు, మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సమీక్షలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణతేజ, ఒఎస్‌డి వెంకటకృష్ణ, ఇఎన్‌సి బాలునాయక్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రధానికి శ్రీశైలం మాస్టర్ ప్లాన్

శ్రీశైలం మాస్టర్‌ప్లాన్‌తో పాటు ఆలయ పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణ, అటవీశాఖకు సంబంధించిన అనుమతులపై నివేదికను ఈ నెల 16న ప్రధాని మోడీకి అందజేయనున్నట్లు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మంగళగిరిలోని డిప్యూటీ సిఎం క్యాంపు కార్యాలయంలో శ్రీశైలం మాస్టర్‌ప్లాన్ గురించి దేవాదాయ, అటవీశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలం దేవస్థానం అభివృద్ధి, మాస్టర్ ప్లాన్ అమలు, దశలవారీ అభివృద్ధి ప్రణాళికలపై సమగ్రంగా చర్చించారు. ఆలయ పరిసరాలు, ప్రాంతాల అభివృద్ధి, యాత్రికులకు సౌకర్యాలు, క్షేత్ర అభివృద్ధి కోసం అటవీ శాఖ అభ్యంతరాలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సమీక్షా సమావేశంలో దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరిజవహర్‌లాల్, కమిషనరు రామచంద్రమోహన్, అటవీశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

2 వారాల్లో వివరణ ఇవ్వండి

- బాణసంచా యూనిట్‌లో పేలుడుపై సిఎస్, డిజిపికి ఎన్‌హెచ్‌ఆర్‌సి నోటీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలోని అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని కొమరిపాలెం గ్రామంలోని బాణసంచా తయారీ యూనిట్‌లో జరిగిన పేలుడులో ఏడుగురు కార్మికులు మరణించడం, మరో నలుగురు గాయపడటంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) స్పందించింది. ఈ ఘటనను సుమోటోగా తీసుకున్న ఎన్‌హెచ్‌ఆర్‌సి విచారణ చేపట్టింది. ఈ ఘటనపై రెండు వారాల్లోగా వివరణాత్మక నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్), డిజిపికి మంగళవారం నోటీసులు జారీ చేసింది. బాధితుల బంధువులకు అందించిన పరిహారం పరిస్థితిని నివేదికలో చేర్చాలని సూచించింది.

ఈ ఏడాది అక్టోబరు 8న బాణసంచా తయారీ యూనిట్‌లో జరిగిన పేలుడుకు సంబంధించి మీడియా నివేదికను ఎన్‌హెచ్‌ఆర్‌సి సుమోటోగా స్వీకరించినట్లు తెలిపింది.

షారోను మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - చీరాల (బాపట్ల జిల్లా)

వాడరేవు సముద్రతీరంలో గల్లంతైన మరో విద్యార్థి షారోన్ మృతదేహం మంగళవారం చిన్నగంజాం సముద్ర తీరంలో పోలీసులు గుర్తించారు. దీంతో వాడరేవు విషాద ఘటనలో ఐదుగురు విద్యార్థుల మృతదేహాలు లభ్యం కావడంతో గాలింపు చర్యలకు తెరపడింది. గల్లంతైన షారోను కోసం నిరీక్షిస్తూ తీరం వద్ద కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎస్‌బి.ఉమామహేశ్వరరావు పరామర్శించారు. షారోను మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

విద్యుత్ సమ్మె వాయిదా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమస్యల పరిష్కారం కోసం నేటి (బుధవారం) నుండి తలపెట్టిన విద్యుత్ సమ్మెను వాయిదా వేసినట్లు పవర్ ఎంప్లాయిస్ జెఎసి తెలిపింది. ఈ మేరకు మంగళవారం అర్థరాత్రి 12 గంటల ప్రాంతంలో ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలో ప్రధానమంత్రి పర్యటన ఉన్న నేపథ్యంలో సమ్మెను వాయిదా వేయాలని యాజమాన్యం కోరడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆ ప్రకటనలో తెలిపింది. అంతకుముందు మంగళవారం ఉదయం నుండి జెఎసి నేతలు పలు దఫాలు యాజమాన్యంతో సమావేశమైనారు. అయితే, కీలకమైన సమస్యల పరిష్కారం విషయంలో ఏర్పడిన ప్రతిష్టంభన అర్థరాత్రి వరకు కొనసాగింది. ఈ నేపథ్యంలో యాజమాన్యం విజ్ఞప్తితో సమ్మెను వాయిదా వేసినట్టు ప్రకటించిన పవర్ జెఎసి 17వ తేదిన తిరిగి చర్చలు జరుపుతామని, ఆ తరువాత నిర్ణయాన్ని తెలియచేస్తామని పేర్కొంది.

రాయలసీమ ప్రాజెక్టుల రూపశిల్పి సుబ్బరాయుడు మృతి

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్



రాయలసీమ జిల్లాలోని పలు సాగునీటి ప్రాజెక్టుల రూపశిల్పి, విశ్రాంత డిప్యూటీ ఇంజనీర్ ఎం సుబ్బారాయుడు (76) మంగళవారం మరణించారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కలిగిరి మండలం మహల్ గ్రామంలో జన్మించారు. తిరుపతి ఎస్‌వి యూనివర్శిటీ నుంచి బిఇ పట్టాను పొందారు. కర్ణాటక, గుజరాత్, మైలవరం డ్యామ్, శ్రీశైలం, గుత్తి, గుంతకల్లు ప్రాంతాల్లో ఇంజనీరింగ్ సేవలు అందించారు. రాయలసీమలో అనేక ప్రాజెక్టుల ఆవశ్యకతను తెలియజేయడంతో పాటు వాటిని సాధించడం కోసం వివిధ ప్రజా సంఘాల హక్కుల నాయకుల పోరాటాలకు దిక్సూచిగా నిలిచారు. వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించిన డీటెయిల్స్ ప్రాజెక్టు రిపోర్టులను (డిపిఆర్) ఆయన స్వయంగా తయారుచేసి ప్రభుత్వానికి అందజేశారు. 2005లో డిప్యూటీ ఇంజనీర్‌గా పదవి విరమణ పొందారు. సుబ్బరాయుడు మృతి తీరని లోటని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్ రెడ్డి ఓ ప్రకటనలో కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు ఏపి రైతు సంఘం పక్షాన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆద్యోగ విరమణ అనంతరం విశ్రాంత జీవితాన్ని కుటుంబం కోసం వెచ్చించకుండా ఉమ్మడి కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల రూపకల్పనకు, అభివృద్ధికి వెచ్చించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు.

హెచ్‌ఎస్‌ఎల్‌కు మినీ రత్న హోదా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)



హిందుస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్) ప్రతిష్టాత్మకమైన మినీ రత్న హోదాను మంగళవారం దక్కించుకుంది. దీనిపై సంస్థ సిఎండి కమాండర్ గిరిదీప్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. సంస్థ ఆర్థిక పునరుజ్జీవనం, కార్యాచరణ, నైపుణ్యం, భారత సముద్ర, రక్షణ రంగాలకు పెరుగుతున్న సహకారంలో ఒక నిర్ణయాత్మక వృద్ధిగా దీన్ని పేర్కొన్నారు. 1941లో స్థాపించబడిన హెచ్‌ఎస్‌ఎల్ భారతదేశ నౌకా నిర్మాణ సామర్థ్యానికి మూలస్తంభంగా ఉంది. దేశ నావిక, వాణిజ్య విభాగాలకు హెచ్‌ఎస్‌ఎల్ సహకరిస్తోంది. తొమ్మిది సంవత్సరాల పాటు నికర లాభాన్ని స్థిరంగా నమోదు చేస్తూ మినీ రత్న హోదాను దక్కించుకుంది. దీని వెనుక సంస్థ కార్మికులు, రక్షణ మంత్రిత్వ శాఖ, తమ వినియోగదారులు, వ్యాపార భాగస్వాముల మద్దతు, నమ్మకం, సహకారం ఉన్నాయని పేర్కొంటూ వారికి సిఎమ్‌డి కృతజ్ఞతలు తెలిపారు.

రబీ సీజన్‌లో యూరియా పంపిణీ సులభతరం

- వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజిర్ జిలానీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రబీ సీజన్‌లో యూరియా పంపిణీని సులభతరం చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజిర్ జిలానీ ఆదేశించారు. మంగళగిరిలోని వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత సీజన్‌లో యూరియా పంపిణీలో ఏర్పడిన సమస్యలు, ప్రతిష్టంభనలు పునరావృతం కాకూదని ఆదేశించారు. వ్యవసాయ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లైన డి కృషి, ఇ-పంట, ఎజైల్, ఎపి ఎయిమ్స్ 2.0, ఎపిఎస్‌ఎస్ తదితర యాప్‌లలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని, డ్రోన్‌ల ద్వారా నానో ఎరువులను, పురుగు మందులను అవసరం మేరకే వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పైలెట్ పథకంగా కొన్ని ప్రాంతాల్లో డిజిటల్ సాంకేతిక విధానాలను ప్రవేశపెట్టి ఫలితాలను పరిశీలించాలన్నారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్షించారు.

కాకినాడ సెజ్ అవార్డు భూములు తిరిగి రైతులకే

మొదటి పేజీ తరువాయి

మండలంలో మరో 2,398 ఎకరాలకు డిక్లరేషన్ కూడా లేకుండానే స్వాధీనం చేసుకుంది. రెండు దశాబ్దాలు గడుస్తున్నా ఈ రెండు మండలాల్లో 4,693 ఎకరాలకు అవార్డులు ప్రకటించలేదు. సుమారు నాలుగు వేల మంది నుంచి ఈ భూములను సేకరించారు. పరిశ్రమలు రాక, ఉపాధి లేక వీరిలో చాలామంది కుటుంబాలను విడిచి ఇతర పనులకు వలస వెళ్లిపోయారు. ఎప్పటికైనా న్యాయం జరుగుతుందని ఆశించారు. కానీ, అవార్డు భూములనే రైతులకు తిరిగి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో, వీరు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ సబ్సిడీ సరే... ఫ్యాక్టరీల రూ.8 వేల సంగతేంటి?

31,929 రైతులకు రూ.147 కోట్లు జమ

జ్యూస్ ఫ్యాక్టరీ యాజమాన్యాలు మొండిచేయి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మేరకు చిత్తూరు జిల్లాలో మామిడి సరఫరా చేసిన 31,929 మంది రైతులకు ప్రభుత్వ సబ్సిడీ రూ.147 కోట్లు విడుదల చేసింది. అయితే, ఫ్యాక్టరీలు ఎంతిస్తాయనే విషయాన్ని మాత్రం ప్రభుత్వాధికారులు తేల్చి చెప్పలేకపోతున్నారు. ప్రభుత్వం అందించిన సబ్సిడీ జాబితాలో 20 మంది రైతులకు సెంటు భూమి లేకపోవడం, 21 మందికి ఐదు లక్షలపైగా సబ్సిడీ జమ ఉండడంతో వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి జమ చేయనున్నట్లు తెలుస్తోంది. మామిడి సీజన్ ప్రారంభంలో జ్యూస్ ఫ్యాక్టరీల యాజమాన్యాలతో చిత్తూరు జిల్లా కలెక్టర్, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు చర్చోపచర్చలు జరిపారు. చివరకు టన్నుకు రూ.8 వేలు ఇచ్చేలా ఫ్యాక్టరీ యజమానులను ఒప్పించారు. ఫ్యాక్టరీలు టన్నుకు రూ.8 వేలు ఇస్తే, ప్రభుత్వం రూ.4 వేలు ఇస్తుందని, తద్వారా రైతుకు టన్నుకు రూ.12 వేలు లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం ఫ్యాక్టరీల యాజమాన్యంతో ప్రత్యేకంగా మాట్లాడి ఇదే విషయాన్ని వెల్లడించారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సైతం చిత్తూరు, గుడిపాలలో నిర్వహించిన మామిడి రైతుల సమావేశంలో ఫ్యాక్టరీలు టన్నుకు రూ.8 వేలు చెల్లించాలని నిర్ణయించామని తెలిపారు. ప్రభుత్వ హామీతో 31,929 మంది రైతులు 3.67 లక్షల మెట్రిక్ టన్నుల మామిడిని ఫ్యాక్టరీలు, ర్యాంపులు, మామిడి కాయల మండీల ద్వారా విక్రయించారు. ముఖ్యమంత్రి మాటలను, కలెక్టర్ హామీని ఏ ఒక్క జ్యూస్ ఫ్యాక్టరీ అమలు చేయలేదు. టన్నుకు మూడు వేల రూపాయల నుంచి ఐదు వేల రూపాయలు లోపే ఇచ్చాయి. సీజన్ ముగిసి రెండున్నర నెలలు కావస్తున్నా నేటికీ అనేక ఫ్యాక్టరీలు మామిడి రైతుల బిల్లులు చెల్లించలేదు.



గిట్టుబాటు ధర లేక రోడ్డుపై పారబోసిన మామిడి పండ్లు (ఫైల్ ఫోటో)

మూడు ఫ్యాక్టరీలకు రాయితీలు కట్ : కలెక్టర్

రైతుల నుండి మామిడి తోలుకొని టన్నుకు రూ.3 వేల నుంచి 4 వేలు ఇచ్చి చేతులు దులుపుకున్న ఫ్యాక్టరీలు పుంగనూరు, గుడిపాల, బంగారుపాళ్యం ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ ఫ్యాక్టరీలకు ప్రభుత్వం నుండి ఎలాంటి సహకారమూ ఉండదని జిల్లా కలెక్టర్ ప్రకటించారు. ఈ ఫ్యాక్టరీలకు మామిడి సరఫరా చేసిన మామిడి రైతులు ప్రభుత్వ సబ్సిడీతో కలిపి టన్నుకు రూ.6 వేల నుంచి రూ7 వేలు మించి పొందలేకపోయారు.

నేడు బంగారుపాళ్యంలో మామిడి రైతుల ఆక్రందన సభ

మామిడి రైతులకు జరుగుతున్న తీవ్ర అన్యాయంపై మామిడి రైతుల సంక్షేమ సంఘం బంగారుపాళ్యంలోని మామిడి మార్కెట్ యార్డు వద్ద ఆక్రందన సభకు బుధవారం పిలుపునిచ్చింది. రైతు సంఘం నాయకులు ప్రభాకరరెడ్డి, రామానాయుడు తదితరులు హాజరు కానున్నారు. మామిడి రైతుల పోరాటానికి సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్, కాంగ్రెస్ మద్దతు ప్రకటించాయి. ఇచ్చిన మాట ప్రకారం టన్నుకు ప్రభుత్వ సబ్సిడీతో రూ.12 వేలు చెల్లించాలని మామిడి రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రకటించిన మద్దతు ధర సైతం ఇవ్వకపోవడం పట్ల ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకొనేందుకు జిల్లాలోని రైతులు సిద్ధం అవుతున్నారు. దీంతో, ప్రభుత్వం ఇవ్వాల్సిన సబ్సిడీని మంగళవారం రైతుల ఖాతాలో జమ చేసింది.

ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులు ఎదుర్కోనేందుకు సామాజిక ఉద్యమం

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దళితులు గిరిజనులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను ఎదుర్కోనేందుకు బలమైన సామాజిక ఉద్యమం నిర్మించాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్ పై బూటు దాడి, ఐపిఎస్ అధికారి పూరణ్ కుమార్ ఆత్మహత్యలను నిరసిస్తూ విజయవాడలోని బాలోత్సవ్ భవన్లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు.

ఈ సమావేశానికి కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దళిత శోషన్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) జాతీయ ఉపాధ్యక్షులు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో అత్యున్నత స్థాయిలో ఉన్న గవాయ్ పై జరిగిన దాడి దేశ ప్రజలపై జరిగిన దాడిగా పేర్కొన్నారు. గతంలో మహారాష్ట్రలో పర్యటనలోను ఆయనను అవమానించిన విషయాన్ని గుర్తు చేశారు. పాలకులు ఈ దాడిని ఖండించినంత మాత్రాన సరిపోదని, ఇందుకు మూలమైన మతోన్మాదాన్ని ఎదుర్కొకపోగా, పెంచిపోషిస్తున్నారని తెలిపారు. గవాయ్ బుద్దిస్ట్ అని, శాంతిని, సామరస్యం, సమానత్వాన్ని కోరుకునే వ్యక్తి అని తెలిపారు. ఐపిఎస్ పూరణ్ కుమార్‌ను సమర్ధవంతమైన పోలీసు అధికారిగా పేర్కొన్నారు. పోలీసు ఉన్నతాధికారి కుల వివక్ష వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవడం ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతుందన్నారు. ప్రజలకు రక్షణకు ఉన్న రెండు కీలకమైన న్యాయ, పోలీసు వ్యవస్థల్లో దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. హోం గార్డ్, కానిస్టేబుల్ నుంచి ఐపిఎస్ అధికారి వరకూ కుల వివక్షను ఎదుర్కొవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సమాజాన్ని 3 వేల ఏళ్ల వెనక్కి తీసుకువెళ్లి మనుషులను బానిసలుగా చేసుకోవడానికే సనాతన ధర్మాన్ని పెంచి పోషిస్తున్నారని చెప్పారు. ఎస్సి ఎస్టీ అత్యాచార బాధితులకు అండగా ఉండాల్సింది పోయి, వారిపైనే కేసులు నమోదు చేస్తున్న పరిస్థితి ప్రస్తుతం నెలకొందని తెలిపారు. మరోవైపు అత్యాచార నిరోధక చట్టం కింద పెట్టిన కేసులు దశాబ్ధాల తరబడి కొనసాగుతూనే ఉన్నాయన్నారు. అన్ని సంఘాలు కలిసి ఐక్యంగా పోరాటం చేస్తేనే ఈ పరిస్థితిని ఎదుర్కోగలమన్నారు.

విశ్రాంత ఐపిఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్ పై జరిగిన దాడి రాజ్యాంగంపై జరిగన దాడిగా పేర్కొన్నారు. దేశంలో దళితులైన ఉన్నత స్థాయి వ్యక్తులపైన, అధికారులపైన వివక్ష కొనసాగుతుందన్నారు. తానూ ఈ వివక్ష బాధితుడినేని చెప్పారు. ఐపిఎస్ అధికారి పూరణ్ కుమార్ ఆత్మహత్యకు కారకులైన వారిపై అక్కడి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడాన్ని తప్పుబట్టారు. ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ మాజీ చైర్మన్ విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని రాసిన సమయంలో అంబేద్కర్ కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారన్నారు. ఈ రాజ్యాంగాన్ని అమలు చేసేవాళ్లు చిత్తశుద్ధి గలవాళ్లయితేనే దాని ఫలితాలు అందరికీ అందుతాయని చెప్పారు. ఇప్పుడు చిత్తశుద్ది లేని పాలకుల చేతుల్లో రాజ్యాగం ఉందని పేర్కొన్నారు.

కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. దేశంలో అత్యున్నత స్థాయిలో ఉన్న దళితులపైన దుర్మార్గమైన కులవివక్ష కొనసాగుతందని, దీని పర్యవసానమే సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై బూటు దాడి, ఐపిఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్యగా పేర్కొన్నారు. బిజెపి పాలిత, తెలుగు రాష్ట్రాల్లోను దళిత, గిరిజనులపైన దాడులు, వ్యవసాయ కార్మికుల ఆత్మహత్యలు పెరిగాయని జాతీయ నేర గణాంక బ్యూరో నివేదిక వెల్లడిస్తుందని తెలిపారు. ఈ అంశంపై ఎస్‌సి, ఎస్‌టి సంఘాలు అన్ని ఈ నెల 27వ తేదీన రాష్ట్ర గవర్నర్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించాలని సమావేశంలో తీర్మానించారు. ప్రతి సంఘం వినతి పత్రాన్ని సిద్ధం చేసుకుని హాజరు కావాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జై భీమ్ పార్టీ నాయకులు కొండలరావు, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు నేతి ఉమామహేశ్వరరావు, ఐఎఫ్‌టియు నాయకులు రామకృష్ణ, ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంఘం నాయకులు జి.పాపారావు, అధికారి, మాలమహానాడు నాయకులు పరసా సురేష్, రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు, డిహెచ్‌పిఎస్ నాయకులు కరవది సుబ్బారావు, హెచ్‌ఆర్‌ఎఫ్ నాయకులు ఆదాము, సామాజిక ఉద్యమ నాయకులు చింతా వెంకటేశ్వర్లు, గంజి రామారావు, నాగేశ్వరరవు, విజయ్, జెవివి నాయకులు శ్రీనివాస్, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ప్రసన్నకుమార్, జి.రామన్న, కెవిపిఎస్ నాయకులు జి.నటరాజ్, సిహెచ్ శ్రీనివాస్, డి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో ప్రసంగిస్తున్న ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్లా చిష్టి

మతోన్మాద ఎజెండాతో బిజెపి పాలన

- ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ అబ్దుల్లా చిష్టి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దేశంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి తన మతోన్మాద ఎజెండాతో పాలన సాగిస్తోందని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ అబ్దుల్లా చిష్టి అన్నారు. ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని రేడియం ఫంక్షన్ హాల్లో 'ప్రస్తుత రాజకీయ పరిణామాలు- మైనార్టీల కర్తవ్యం' అన్న అంశంపై మంగళవారం సదస్సు జరిగింది. ఆవాజ్ జిల్లా కార్యదర్శి వలి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ముఖ్యవక్తగా చిష్టి హాజరై మాట్లాడారు. తన మతోన్మాద ఎజెండాను అమలు చేయడంలో బిజెపి ఎక్కడా వెనక్కి తగ్గడంలేదన్నారు. మైనార్టీలపై దాడులు, వక్ఫ్ సవరణ చట్టం తదితర వాటిని వేగంగా అమలు చేస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా లౌకిక శక్తులన్నీ కలిసి పోరాటం చేయాల్సిన అవశ్యకత ఉందని వివరించారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం మైనార్టీలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగిస్తోందన్నారు. దక్షిణాదిన మతోన్మాద ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అద్దం పెట్టుకుని సనాతన ధర్మం, హైందవ శంఖారావం, తిరుపతి లడ్డు వివాదం తదితర అంశాలతో కేంద్రంలోని బిజెపి హిందుత్వను రెచ్చగొడుతూ విద్వేషాలను పెంచుతోందని విమర్శించారు. సిఐటియు నాయకులు రామిరెడ్డి మాట్లాడుతూ హిందూ, ముస్లిముల మధ్య చిచ్చు పెట్టేలా పాలన సాగిస్తోన్న బిజెపి విధానాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ నగర అధ్యక్షులు మసూద్ ఇర్ఫాన్, అవాజ్ నాయకులు గఫూర్, జీవ, ఇస్మాయిల్, ఫయాజ్, ఆజం, ఫాదర్ సంఘం నాయకులు యేసయ్య, ఆది, డేవిడ్ పాల్గొన్నారు.

పశుసంవర్ధక సహాయకుల పోస్టులు భర్తీ చేయాలి : డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పశు సంవర్ధక శాఖలో ఖాళీగా ఉన్న పశుసంవర్ధక సహాయకులు (ఎహెచ్ఎ) పోస్టుల భర్తీకి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని, రైతు సేవా కేంద్రాల్లో క్లస్టర్ విధానాన్ని రద్దు చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. అమరావతిలోని సచివాలయంలో పశుసంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్‌ను డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న, ఇతర నాయకులు మంగళవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. రాష్ట్రం పశు సంపదలో ముందంజలో ఉందని, రాష్ట్ర ప్రభుత్వం.. పశుసంవర్ధకశాఖ చేస్తున్న కృషితో మెరుగైన ఫలితాలు సాధించిందన్నారు. ఈ కృషి మరింత ముందుకు తీసుకెళ్లాలంటే ఎహెచ్ఎ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డెయిరీ సైన్స్, వెటర్నరీ డిప్లమో కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగులు 50 వేల మంది ఉన్నారని తెలిపారు. ఇటు నిరుద్యోగులు, అటు రైతులకు న్యాయం చేసి పశు సంపదను అభివృద్ధి చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నమ్మి నోటిఫికేషన్ వస్తుందని వేలాది మంది కోచింగ్‌కు డబ్బులు ఖర్చు చేశారని, ఇప్పటికే నిరుద్యోగులు ఆర్థికంగా చితికిపోయి ఉన్నారని, తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అంతకముందు వ్యవసాయశాఖ డైరెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు శివ, బసవ, శ్రీను, నిరుద్యోగులు టి రాము, పి రఫీ, పి నాగేంద్ర, కె మంగరాజు, ఎం ఉమాశంకర్, కె బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలు నడిరోడ్డుపై వ్యక్తి దారుణ హత్య

- స్కూటీపై వచ్చి కత్తితో పొడిచి పరారైన దుండగుడు

ప్రజాశక్తి - తెనాలి (గుంటూరు జిల్లా)

తెనాలి పట్టణంలో మంగళవారం పట్టపగలు నడిరోడ్డుపై ఓ వ్యక్తి దారుణహత్యకు గురయ్యారు. తలకు హెల్మెట్ ధరించి స్కూటీపై వచ్చిన దుండగుడు కొబ్బరి బొండాల కత్తితో వ్యక్తిని హతమార్చి, అదే స్కూటీపై పరారయ్యాడు. పోలీసులు, స్థానికులు వెల్లడించిన వివరాల ప్రకారం... బాపట్ల జిల్లా అమృతలూరు మండలం కోడితాడిపర్రు గ్రామానికి చెందిన జూటూరి బుజ్జి (50) దాదాపు పది రోజుల క్రితం చెంచుపేటలోని కైలాష్ భవన్ రోడ్డులో నివాసముంటున్న కుమార్తె వద్దకు వచ్చారు. స్థానికంగా రోడ్డుపై ఉన్న టిఫిన్ సెంటర్‌కు వచ్చి ద్విచక్ర వాహనంపై కూర్చుని మరో వ్యక్తితో మాట్లాడుతుండగా, గుర్తు తెలియని దుండగుడు తలకు హెల్మెట్ ధరించి స్కూటీపై వచ్చాడు. బుజ్జిపై కొబ్బరి బొండాలు నరికే కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి, స్కూటీపై పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన బుజ్జి రక్తపు మడుగులో కుప్పకూలిపోయి, ఘటనా స్థలంలోనే మృతి చెందారు. క్షణాల్లో జరిగిన ఈ ఘటనపై టిఫిన్ సెంటర్ నిర్వహించే మహిళతో పాటు స్థానికులు నివ్వెరపోయారు. తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న డి.ఎస్.పి బి.జనార్ధనరావు, త్రీ టౌన్ సిఐ ఎస్.సాంబశివరావు సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకున్నారు. స్థానికులను ఘటనపై విచారించారు. ఆ రోడ్డులో సిసి టివి ఫుటేజ్ పరిశీలించే పనిలో నిమగ్నమయ్యారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. త్రీ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే బృందాలుగా నిందితుడి కోసం గాలిస్తున్నామని, త్వరలోనే కేసు ఓ కొలిక్కి వస్తుందని పోలీసులు తెలిపారు.

'కెజిబివి' కేసులో ఉన్నతాధికారుల హాజరు

ప్రజాశక్తి-అమరావతి

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కెజిబివి) శాశ్వత ప్రాతిపదికన బోధనా సిబ్బంది నియామకాల వ్యవహారంపై దాఖలైన పిటిషన్ విచారణకు ఆన్‌లైన్‌లో కేంద్ర పాఠశాల మంత్రిత్వశాఖ కార్యదర్శి సంజయ్ కుమార్ హాజరయ్యారు. కోర్టుకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి కోనా శశిధర్ స్వయంగా హాజరయ్యారు. దేశంలోని పేద పిల్లల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని బోధనా సిబ్బంది నియామకాలపై మార్గదర్శకాలు రూపొందించాలని కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. శాశ్వత సిబ్బందిని నియమించే అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చలు జరిపి తగిన నిర్ణయం తీసుకోవాలంది. చర్చల పురోగతిని నాలుగు వారాల తర్వాత జరిగే విచారణలో తెలియజేయాలంది. ఈ మేరకు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథ శర్మతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఆదేశించింది. కెజిబివిల్లో శాశ్వత సిబ్బంది నియామకాలు చేయకపోవడం, 2004 నుంచి ఇప్పటి వరకు రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నా కెజిబివి ఏర్పాటు ఉద్దేశం నెరవేరకపోవడంపై హైకోర్టు గత విచారణలో అసంతృప్తిని వ్యక్తం చేసింది. గత ఆదేశాల మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు విచారణకు హాజరయ్యారు. సమగ్రశిక్ష పథకం 2026 వరకు అమల్లో ఉంటుందని కుమార్ చెప్పారు. ఆ తర్వాత ఆర్థికశాఖ అనుమతితో కొనసాగేందుకు వీలుంటుందన్నారు. కోన శశిధర్ స్పందిస్తూ, సమగ్రశిక్ష పథకం ఎంతకాలం కొనసాగుతుందో స్పష్టత లేదని, శాశ్వత ప్రాతిపదికన బోధనా సిబ్బందిని నియమించాక సమగ్రశిక్ష పథకాన్ని అర్థాంతరంగా ఆగిపోతే బోధనా సిబ్బందిని వేరేచోట సర్దుబాటు కష్టం కావచ్చునని చెప్పారు. పిటిషనర్లను కెజిబివిల్లో కొనసాగించాలని సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది జి రామచంద్రరావు చెప్పారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై దాఖలు చేసిన అప్పీళ్లను ఉపసంహరణకు అనుమతినివ్వాలని కోరగా.. హైకోర్టు నిరాకరించింది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

190 కొత్త 108 వాహనాలు

- వైద్యారోగ్య శాఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 190 కొత్త 108 వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వైద్యారోగ్యశాఖ వెల్లడించింది. దీంతో ప్రమాద క్షతగాత్రులకు, అత్యవసర సమయాల్లో మరింత వేగంగా సేవలు అదించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం టెండరు నిబంధనల్లో పేర్కొన్న ప్రకారం సిద్ధమైన ఈ కొత్త అంబులెన్స్‌లను త్వరలోనే ముఖ్యమంత్రి, వైద్యారోగ్యశాఖ మంత్రి ప్రారంభిస్తారని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుతం ఉన్న అంబులెన్స్‌లలో బాగా పాడైన వాటిని తొలగించి, కొత్తవాటిని వినియోగించనున్నట్లు తెలిపింది.

అనారోగ్యంతో గిరిజన విద్యార్థి మృతి

ప్రజాశక్తి-సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా)

అనారోగ్యంతో గిరిజన విద్యార్థి మృతి చెందిన ఘటన పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలంలో ఆలస్యంగా మంగళవారం వెలుగుచూసింది. విద్యార్థి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. సాలూరు మండలం మామిడిపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న తాడంగి పల్లవి దసరా సెలవులకు తన స్వగ్రామం బొబ్బిలి మండలం కృపావలస వెళ్లింది. అక్కడ అనారోగ్యానికి గురవ్వడంతో బాలిక తల్లిదండ్రులు బొబ్బిలిలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. మెదడువాపు వ్యాధి ఉన్నట్లు కెజిహెచ్ వైద్యులు నిర్ధారించారు. పరిస్థితి విషమించి నాలుగు రోజుల క్రితం పల్లవి మృతి చెందింది. పల్లవి పాఠశాలలకు రాకపోవడంతో పాఠశాల హెచ్‌ఎం బాలిక తల్లిదండ్రులకు ఫోన్ చేయడంతో ఈ విషయం తెలిసింది.

హైడ్రో ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలి

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం


మాట్లాడుతున్న లోకనాథం

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి జిల్లా)

ఏజెన్సీ ఐదో షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలు, అనకాపల్లి సబ్‌ప్లాన్ ఏరియాలో హైడ్రో పవర్ ప్రాజెక్టులకు ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తూ అసెంబ్లీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటన చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. పాడేరులో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రో ప్రాజెక్టుల ప్రతిపాదన ఆదివాసీలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందన్నారు. వీటి ఏర్పాటుతో ఆదివాసీల హక్కులు, భూములు, సంస్కృతి, పర్యావరణం దారుణంగా దెబ్బతింటాయన్నారు. ఆయా ప్రాంతాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి నవయుగ, మేఘా, అదాని, శ్రీ శిరిడిసాయి వంటి కార్పొరేట్ కంపెనీలకు ఆదివాసీ గ్రామసభల ఆమోదం లేకుండానే 51, 13, 2 జిఒలను జారీ చేశారన్నారు. ఆదివాసీల చట్టాలు, హక్కులకు పూర్తి విరుద్ధంగా కార్పొరేట్ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం అక్రమ ఒప్పందం చేసుకోవడం దారుణమని, కనీసం గిరిజన సలహా మండలి అభిప్రాయం కూడా తీసుకోలేదని తెలిపారు. ఈ ప్రాజెక్టుల వల్ల ఎనిమిది మండలాల్లోని 250 గ్రామాల్లో 50 వేల మంది ఆదివాసీలతో పాటు 20 వేల ఎకరాల అటవీ, వ్యవసాయ సొంత భూములు జలసమాధి కానున్నాయన్నారు.

గుజ్జెలి, పెదకోట, చిట్టంవలస, సీలేరు, ఎర్రవరం వంటి చోట్ల తలపెట్టే ప్రాజెక్టుల్లో మొత్తం 7,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో అదాని సంస్థలకు సంబంధించిన రెండు హైడ్రో పవర్ ప్రాజెక్టులను స్థానిక సమస్యలు, ఆదివాసీల ఆందోళనతో ఈ ఏడాది జూలై 29న రద్దు చేశారని, మిగిలిన వాటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో కాఫీ పంటకు బెర్రీ బోరర్ తెగులు సోకి తీవ్ర నష్టం జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం సరైన నియంత్రణా చర్యలు చేపట్టడం లేదన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, కార్యదర్శివర్గ సభ్యులు దీసరి గంగరాజు, బిసిహెచ్.పడాల్, వి.ఉమామహేశ్వరావు, పోతురాజు, త్రినాథ్ పాల్గొన్నారు.

యూరప్ మార్కెట్లపై టెక్స్‌టైల్ ఎగుమతిదారుల దృష్టి

- అమెరికా కస్టమర్లకు ప్రత్యేక డిస్కౌంట్లు
- ట్రంప్ టారిఫ్‌లతో సగం మంది ఉపాధికి ఎసరు



న్యూఢిల్లీ : భారత టెక్స్‌టైల్ ఉత్పత్తుల ఎగుమతిదారులు యూరప్ మార్కెట్లపై దృష్టి పెట్టారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగస్టులో భారత దిగుమతులపై 50 శాతం టారిఫ్‌లను విధించడంతో భారత వస్త్రాలు, ఆభరణాలు, రొయ్యలు వంటి ఉత్పత్తులపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోంది. దీనిని ఎదుర్కొనేందుకు ఎగుమతిదారులు ఐరోపా మార్కెట్‌లకు మళ్లుతున్నారని రాయిటర్స్ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. తమ కంపెనీ ఇటీవల యూరోపియన్ యూనియన్ మార్కెట్లకు ప్రాధాన్యతను ఇస్తోందని ముంబయిలోని ఓ గార్మెంట్ ఎగుమతిదారు పేర్కొన్నారు. భారత్, ఇయు మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరితే ఎగుమతులు మరింత పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ చర్చలు నిర్ణయాత్మక దశలో ఉన్నాయి. ఈ ఏడాది ముగింపు నాటికి ఒప్పందం కుదిరేలా రెండు వైపులా అధికార బృందాలు పని చేస్తున్నాయి.

భారత్‌కు వస్తువుల ఎగుమతి, దిగుమతుల్లో ఇయు అతిపెద్ద భాగస్వామిగా ఉంది. మార్చి 2024తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ద్వైపాక్షిక వాణిజ్యం 137.5 బిలియన్ డాలర్లకు చేరింది. గత 10 ఏళ్లలో దాదాపుగా 90 శాతం పెరిగింది. ఇయు కఠిన నిబంధనలు, కెమికల్స్, ప్రొడక్ట్ లేబులింగ్, ఎథికల్ సోర్సింగ్ పాటించేందుకు భారత ఎగుమతిదారులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారని క్లోథింగ్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ మెంటర్ రాహుల్ మెహతా తెలిపారు. ఇయు ప్రమాణాలకు అనుగుణంగా ఉత్పాదక కేంద్రాలను అప్‌గ్రేడ్ చేస్తున్నామన్నారు. అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2025 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో అమెరికాకు భారత్ 38 బిలియన్ డాలర్ల విలువ చేసే వస్త్ర ఉత్పత్తులను ఎగుమతి చేసింది. ఇది దేశ మొత్తం వస్త్ర ఎగుమతుల్లో 29 శాతం వాటా కావడం విశేషం.

కొందరు ఎగుమతిదారులు అమెరికా కస్టమర్లను నిలబెట్టుకోవడానికి ప్రత్యేక డిస్కౌంట్లు ఇస్తున్నారని ముంబయిలోని క్రియేటివ్ గ్రూప్ చైర్మన్ విజయ్ కుమార్ అగర్వాల్ తెలిపారు. అమెరికా అధిక టారిఫ్‌లు కొనసాగితే 15,000 మంది కార్మికుల్లో 6,000-7,000 మందిని కోల్పోవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే ఆరు నెలల్లో ఓమన్ లేదా బంగ్లాదేశ్‌కు ఉత్పాదనను తరలించే ఆలోచన ఉందని చెప్పారు. అదే జరిగితే భారత వస్త్ర తయారీ పరిశ్రమ మరింత గడ్డుకాలాన్ని ఎదుర్కోనుంది.


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న త్రివిక్రమ్

ఎపిఎస్‌పిఎఫ్ బలోపేతానికి కృషి

- రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో డైరెక్టర్ జనరల్ త్రివిక్రమ్

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)

క్రీడలతో మెరుగైన క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం, ఐకమత్యం పెంపొందుతాయని, గెలుపు, ఓటమి తేడా లేదని, క్రీడా స్ఫూర్తి గొప్పదని ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ ఫోర్స్ (ఎపిఎస్‌పిఎఫ్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ సిఎం త్రివిక్రమ్ వర్మ అన్నారు. ఎపిఎస్‌పిఎఫ్ 34వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు.

వాలీబాల్, బ్యాడ్మింటన్, వంద మీటర్లు, 400 మీటర్లు, ఐదు కిలోమీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించనున్నారు. దాదాపు రెండు వందల మంది అధికారులు, సిబ్బంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ...ఎపిఎస్‌పిఎఫ్ బలోపేతానికి కృషి చేస్తున్నామని, నూతన నియామకాలు చేపడుతున్నామని తెలిపారు. ఇన్‌స్పెక్టర్ జనరల్ బి.వి. రామిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో మినీ శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం స్థలాలు కేటాయించిందన్నారు. సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించారని, ఉద్యోగోన్నతులు, నూతన నియామకాల పట్ల దృష్టి పెట్టామని తెలిపారు. విజయవాడ జోన్ కమాండెంట్ ముద్దాడ శంకర్రావు, కమాండెంట్ డిఎన్ఎ బాషా, అసిస్టెంట్ కమాండెంట్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా పనిచేసేవారికి గుర్తింపు

- వైసిపి కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పార్టీలో ఉత్సాహంగా పనిచేసేవారికి గుర్తింపు ఉంటుందని, ప్రాధాన్యత ఇవ్వాలని వైసిపి కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్టీ రాష్ట్ర కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ పదవులను బాధ్యతగా భావించి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. నకిలీ మద్యంపై సిఎం చంద్రబాబు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. తప్పుల మీద తప్పులు చేస్తున్నారని తెలిపారు. సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించుకోవాలని, ప్రతి అనుబంధ విభాగాన్ని వాడుకోవాలని తెలిపారు. నియోజకవర్గం, పార్టీ కేంద్ర కార్యాలయానికి కళ్లు, చెవుల్లా పనిచేయాలన్నారు. మద్యం కల్తీ జరుగుతోందని, బెల్టుషాపులు విచ్చలవిడిగా ఉన్నాయని, వాటిని అరికట్టకుండా వైసిపిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహించారు.

నకిలీ మద్యం వెనుక ప్రభుత్వ పెద్దలు : కేతిరెడ్డి

నకిలీ మద్యం వెనుక ప్రభుత్వ పెద్దలు ఉన్నారని, అందుకే కేసు విచారణ సక్రమంగా జరగడం లేదని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి విమర్శించారు. కేసు దర్యాప్తును సిబిఐకి అప్పగించాలన్నారు. నకిలీ మద్యం కేసులో టిడిపి నేతలు అడ్డంగా దొరికారని, పొంతనలేని ప్రకటనలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం దందాను జోగి రమేష్ బయటపెడితే ఆయననే ఇరికించే పనిచేస్తున్నారని విమర్శించారు.

బంగారం భగభగ

- 10 గ్రాములు రూ.1.30 లక్షలు
- ఆగని వెండి మెరుపులు

న్యూఢిల్లీ : బంగారం, వెండి ధరలు రోజు రోజుకు సరికొత్త రికార్డ్‌లను సృష్టిస్తున్నాయి. పసిడి ఇది వరకు ఎప్పుడూ లేని విధంగా రూ.1.3 లక్షలకు ఎగిసి భగ్గుమంటోంది. ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ ప్రకారం.. మంగళవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.2,850 పెరిగి అన్ని పన్నులు కలుపుకుని రూ.1,30,800కు చేరింది. ఇంతక్రితం సెషన్‌లో రూ.1,27,950 వద్ద ముగిసింది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల పసిడి రూ.2,850 ప్రియమై రూ.1,30,200గా పలికింది. కిలో వెండిపై ఏకంగా రూ.6,000 ఎగిసి రూ.1,85,000కు చేరింది. ఇది వరుసగా ఐదో రోజూ పెరుగుదల. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ బంగారం 0.72 శాతం పెరిగి ఒక్క ఔన్స్ ధర 4,140.34కు చేరి.. ఆల్‌టైం గరిష్ట స్థాయిని నమోదు చేసింది. ఒక్క ఔన్స్ స్పాట్ వెండి 1.92 శాతం ప్రియమై 53.54 డాలర్లుగా చోటు చేసుకుంది.

రూపాయి చారిత్రాత్మక పతనం

- డాలర్‌తో పోల్చితే 88.80కు క్షీణత

ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ ఆల్‌టైం కనిష్ట స్థాయికి పడిపోయింది. రూపాయి చరిత్రలోనే ఎప్పుడూ లేని స్థాయిలో ఇంట్రాడేలో 88.81కు పతనమయ్యింది. భారత్‌పై అమెరికా వేసిన భారీ టారిఫ్‌లతో దేశీయ ఎగుమతులపై ప్రతికూల ప్రభావం నెలకొనడంతో రూపాయిపై ఒత్తిడి నెలకొందని నిపుణులు పేర్కొన్నారు. మరోవైపు డాలర్ల కొనుగోళ్లకు దిగుమతిదారులు మొగ్గు చూపడం, రూపాయి పతనాన్ని కట్టడి చేయడంలో మోడీ సర్కార్ విఫలం కావడం, స్టాక్ మార్కెట్లలో ఒత్తిడి, ఎఫ్‌ఐఐలు తరలిపోవడం తదితర పరిణామాలు దేశీయ కరెన్సీని రికార్డ్ కనిష్టానికి నెట్టాయి. ఈ నేపథ్యంలోనే మంగళవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 12 పైసలు పతనమై 88.80కి దిగజారింది. ఫారెక్స్ మార్కెట్‌లో ఉదయం 88.73 వద్ద ప్రారంభమైన రూపాయి విలువ ఓ దశలో 88.81 అత్యల్ప స్థాయికి పడిపోయింది. ఇంతక్రితం సెప్టెంబర్ 30న 88.80 కనిష్ట స్థాయిని తాకింది. ఆ తర్వాత ఈ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి. రూపాయి విలువ పతనం అంతర్జాతీయ మార్కెట్‌లో దిగుమతులను భారం చేయనున్నాయి. మరోవైపు విదేశీ చెల్లింపుల భారం పెరిగిపోనుంది.

సంపాదకీయం


స్వతంత్ర పాలస్తీనాతోనే!

మరుభూమిగా మారిన గాజాలో ఇప్పుడిప్పుడే ప్రశాంతత నెలకొంటోంది. గాజాలో కాల్పుల విరమణకు సంబంధించి ట్రంప్ ప్రతిపాదించిన 20 అంశాల శాంతి ప్రణాళిక తొలి దశ అమలులోకి రావడంతో స్థానికుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఇరుపక్షాలు బందీలను విడిచిపెట్టడంతో వారి కుటుంబాలతోపాటు ప్రజల్లోనూ కొంత ఉపశమనం కనిపిస్తోంది. పాలస్తీనా భూభాగంపై పశ్చిమ దేశాల మద్దతుతో ఏర్పడిందే ఇజ్రాయిల్. 365 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న గాజాపై అది పాల్పడిన బీభత్సం, విధ్వంసం ఈ శతాబ్దంలో మరెక్కడా చోటుచేసుకోలేదు. 67,682 మంది పాలస్తీనా వాసులు ప్రాణాలు కోల్పోయారు. వారిలో చిన్నారులే 20,179 మంది. 28 వేల మంది మహిళలు, బాలికలు ప్రాణాలు కోల్పోయారు.

ఇంతటి మారణహోమానికి, విధ్వంసానికి పాల్పడిన ఇజ్రాయిల్‌కు ప్రధాన మద్దతుదారు అయిన ట్రంప్ శాంతి ప్రతిపాదన ఆధారంగానే హమాస్, ఇజ్రాయిల్ కాల్పుల విరమణకు అంగీకరించాయి. పరస్పరం బందీలను విడిచిపెట్టాయి. గాజా నుంచి కొంతవరకూ దళాలు వెనక్కి వస్తున్నాయి. అదే సమయంలో ఇజ్రాయిల్ తన పాత బుద్ధి చూపించుకుంది. తాజాగా, మరో తొమ్మిదిమంది పాలస్తీనియన్లను పొట్టనపెట్టుకోవడం దాని ఉన్మాదానికి నిదర్శనం. పాలస్తీనా ప్రజల సమస్య పరిష్కారమైతేనే గాజా, వెస్ట్‌బ్యాంక్‌లో ప్రశాంతత నెలకొంటుంది. 1967 నాటికి 78 శాతం భూభాగాన్ని ఆధీనంలోకి ఇజ్రాయిల్ తెచ్చుకుంది. కొత్తగా స్వాధీనం చేసుకున్న 22 శాతం భూభాగాన్ని ఖాళీ చేయాలని ఐరాస అనేక తీర్మానాలు చేసిన బుట్టదాఖలు చేసిన చరిత్ర టెల్ అవీవ్‌ది. పాలస్తీనా ప్రజలతో చర్చల అనంతరం 1993, 1995లో చేసుకున్న ఓస్లో ఒప్పందాల అమలుకూ మోకాలడ్డింది. గత రెండేళ్ల మారణహోమంతో ఇజ్రాయిల్ రక్తపిపాసిగా ప్రపంచ ప్రజల మనసుల్లో ముద్రపడిపోయింది. అమెరికా సహా ప్రపంచ దేశాల్లో నిరసనలు పెల్లుబికాయి. ఇంతకాలం వత్తాసు పలికిన పశ్చిమ దేశాలుసైతం స్వతంత్ర పాలస్తీనా పల్లవి అందుకునేంతగా ఒత్తిడి పెరిగిపోయింది. మొదట పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తానన్న ట్రంప్ అందువల్లే శాంతి ప్రణాళిక పల్లవి అందుకున్నారు. ప్రణాళికలో పాలస్తీనా ప్రజల ఆకాంక్ష, ప్రపంచ ప్రజానీకం మద్దతు పొందిన స్వతంత్ర పాలస్తీనాకు ఎటువంటి ప్రాధాన్యత లేకపోవడం దారుణం.

తాజా ప్రణాళికపై ప్రపంచ దేశాల నేతల సమక్షంలో ట్రంప్ ఆర్భాటంగా సంతకాలు చేసినా, ఇజ్రాయిల్ ప్రధాని సాకులు చెప్పి ఎగ్గొట్టారు. స్వతంత్ర పాలస్తీనాకు మోకాలడ్డుతున్న ఇజ్రాయిల్... తదుపరి ప్రణాళికలను ఎలా అమలు చేస్తుందో చూడాలి. హమాస్ ఇప్పటికీ ప్రజల్లోనే ఉంది. ఇజ్రాయిల్ వైఖరి చూస్తే దాని మారణహోమం ఆగినా, ముగియలేదనేది స్పష్టం. మధ్య ప్రాచ్యం అంతా ఇజ్రాయిల్ రేపిన మంటలే! తనపై దాడులపై ఖతార్ కన్నెర్ర చేయడంతో నెతన్యాహుతో ట్రంప్ క్షమాపణ చెప్పించాల్సి వచ్చింది. అమెరికాతో మిత్రదేశాలుగా ఉన్న ఇతర దేశాలు తమ భద్రతపై ఆందోళనతో ఉన్నాయి. 'ఆకాశం నిర్మలంగా ఉంది. తుపాకులు మూగబోయాయి. సైరన్లు ఆగిపోయాయి. ఎట్టకేలకు ప్రశాంతంగా ఉన్న పవిత్ర భూమిలో సూర్యుడు ఉదయించాడు'... అంటూ ఇజ్రాయిల్ పార్లమెంట్‌లో ట్రంప్ చేసిన ప్రసంగాన్ని అక్కడి ఎంపీలే అడ్డుకున్నారు. స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటు చేయాల్సిందేనని ప్లకార్డులు చూపారు. ఇన్నేళ్ల రక్తపాతాన్ని స్పాన్సర్ చేసి ఇప్పుడు శాంతి వచనాలు చెబుతున్న ట్రంప్... ఇకనైనా పక్షపాతంతో కాకుండా స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు బాటలు వేస్తేనే... శాంతి నెలకొంటుంది. గతంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాల్లా... తుంగలో తొక్కకుండా ఇజ్రాయిల్‌ను అడ్డుకోవాల్సిన బాధ్యత అమెరికాదే. మరోసారి దూకుడుకు, దురాక్రమణకు పాల్పడకుండా నివారించేలా ఒత్తిడి చేయాల్సిన బాధ్యత అంతర్జాతీయ సమాజంపైనా ఉంది. పాలస్తీనా భూభాగాల ఆక్రమణకు స్వస్తి చెప్పి, ఐక్యరాజ్య సమితి చేసిన తీర్మానాలను అమలు చేయాల్సిన బాధ్యత ఇజ్రాయిల్‌ది. 1967కి ముందునాటి సరిహద్దుల ప్రాతిపదికన జెరూసలేం రాజధానిగా స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పాటైతేనే న్యాయమైన, శాశ్వతమైన శాంతి నెలకొంటుంది.

మంచి మాట



ఎవరినైనా తేలిగ్గా ఓడించవచ్చు. కానీ, వారి మనసును గెలవాలంటే మాత్రం... ఎంతో శ్రమించాలి.

- ఎ.పి.జె. అబ్దుల్ కలాం, భారత పూర్వ రాష్ట్రపతి.

నోబెల్ శాంతి బహుమతి ట్రంప్ బుట్టలోనే !


విశ్లేషణ

శాంతనూ దే

మాడ్రిడ్, ఫిబ్రవరి 8-9, 2025. యూరోపియన్ పార్లమెంట్ లోని తీవ్ర మితవాద కూటమి 'పేట్రియాట్ ఫర్ యూరప్' బ్యానర్ కింద ఆ నగరంలోని ఆడిటోరియం హోటల్‌లో సమావేశమైంది. 720 మంది సభ్యుల యూరోపియన్ పార్లమెంట్‌లోని 86 మంది సభ్యులు అక్కడ సమావేశమయ్యారు. ట్రంప్ రెండవసారి వైట్‌హౌస్‌కు ఎన్నికై ఇంకా ఇరవై రోజులు కూడా కాలేదు. ప్రపంచవ్యాప్త అతి మితవాదులందరూ సహజంగానే మహానందంగా ఉన్నారు. స్పెయిన్ దేశపు తీవ్ర మితవాది, నయా ఫ్రాంకోయిస్ట్ పార్టీ అయిన వోక్స్ పార్టీ ఈ పేట్రియాట్ సంస్థను నిర్వహిస్తోంది. ఫ్రాన్స్ దేశపు నయా ఫాసిస్టు నేషనల్ ర్యాలీకి చెందిన లే పెన్ నుండి జర్మనీలోని అతి మితవాద నియో-నాజీ ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ పార్టీ వరకూ అసలక్కడ లేనిదెవరు? హంగేరీ ప్రధాన మంత్రి విక్టర్ ఓర్బన్ నుండి ఆస్ట్రియా, ఎస్టోనియా, పోలాండ్, పోర్చుగల్, గ్రీస్, ఇటలీ వంటి దేశాల్లోని అన్ని తీవ్రవాద పార్టీల వారంతా హాజరయ్యారు.

రెండు రోజుల మాడ్రిడ్ సమావేశం 'భవిష్యత్తు మాదే' అన్న స్పష్టమైన హెచ్చరిక చేస్తూ ముగిసింది. అందరూ ట్రంప్‌ను తమ 'మంచి మిత్రుడ'ని సగర్వంగా చాటారు. అమెరికా అధ్యక్షుడి 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' (వాస్తవానికి, 'మేక్ అమెరికన్ ఇంపీరియలిజం గ్రేట్ ఎగైన్') నినాదానికి అనుగుణంగా అక్కడి వారంతా 'మేక్ యూరప్ గ్రేట్ ఎగైన్' అని నినదించారు! మరో అడుగు ముందుకేస్తూ 'కొన్ని వారాల్లోనే, ట్రంప్ టోర్నడో మొత్తం ప్రపంచాన్నే మార్చేసింది. ఇప్పుడు మనదే ప్రధాన స్రవంతి' అంటూ ఓర్బన్ ప్రకటించాడు. అక్కడికి కొన్ని రోజుల తర్వాతనే ముస్సోలినీ వారసురాలైన ఇటాలియన్ ప్రధాన మంత్రి జార్జియా మెలోనీ అమెరికాలో జరిగిన నియో-ఫాసిస్ట్ 'కన్జర్వేటివ్ పొలిటికల్ యాక్షన్ కాన్ఫరెన్స్' (సి.పి.ఎ.సి) సమావేశాన్ని ఒక వీడియో ద్వారా సంభోదిస్తూ 'దేశదేశాల్లో మనమే విజయాలు సాధించబోతున్నాం. అమెరికాలో మనం విజయం సాధించాం...ట్రంప్ విజయం చూసి అందరూ భయంతో వణికిపోతున్నారు. త్వరలో ఇతర దేశాల నుండి శుభవార్త వస్తుంది.' అన్నారు.

అంచేత, 'వెనిజులా పోరాటం ఇజ్రాయిల్ పోరాటమే' అని మచాడో ప్రకటించినప్పుడు, ఆమె వాస్తవానికి అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వెనిజులా చేస్తున్న నిజమైన పోరాటాన్ని మరుగున పడేయడానికి ప్రయత్నించారు. వెనిజులా ఇప్పటికీ ప్రతి కోణంలోనూ పాలస్తీనాకు తోడుగా ఉంది. మచాడోకు శాంతి బహుమతిని ప్రదానం చేయడమంటే నోబెల్ కమిటీ నెతన్యాహూ మారణహోమాన్ని విస్మరిస్తున్నట్టే!



ఇదంతా సహజమే. యథాలాపంగా జరిగేదే. కానీ యూరప్ వెలుపల ఉన్న మూడు పార్టీల ప్రతినిధులను కూడా మాడ్రిడ్ సమావేశానికి ఆహ్వానించడం మాత్రం గమనార్హం. ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు లికుడ్ పార్టీనీ, అర్జెంటీనాలోని అత్యంత మితవాద అధ్యక్షుడు జేవియర్ మియెలానూ, వెనిజులా అతి మితవాద పార్టీ వెంటే వెనిజులా నాయకురాలు మరియా కొరినా మచాడోనూ ఈ సమావేశాలకు ఆహ్వానించారు.

వెనిజులాలో క్రమపద్ధతిలో మార్పును తీసుకురావడానికి నిజాయితీతో మద్దతునిస్తున్న యూరోపియన్ మిత్రదేశాలు తమ ప్రయత్నాలను కొనసాగించాలని ఒక వీడియో సందేశం ద్వారా పిలుపునిచ్చారు మరియా మచాడో. "నేడు మన ఖండంలో పశ్చిమ దేశాలకు అతి పెద్ద ముప్పు వెనిజులా. ఇది వ్యవస్థీకృత నేరాలకు కేంద్రంగా, ప్రపంచవ్యాప్త ప్రజాస్వామ్య శత్రువులకు సురక్షితమైన స్వర్గధామంగా ఉంది. మేము ఈ పాలకులను అధికారం నుండి తొలగిస్తాము" అని ఆమె ప్రకటించారు ('లా జోర్నాడ', ఫిబ్రవరి 9, 2025).

గత శుక్రవారం భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:30 గంటలకు అన్ని ఊహాగానాలకూ ముగింపు పలుకుతూ, నోబెల్ కమిటీ 2025 నోబెల్ శాంతి బహుమతిని వెనిజులా ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరినా మచాడోకు ప్రదానం చేయనున్నట్లు ప్రకటించింది. వెనిజులా ప్రతిపక్షం ఒకప్పుడు అనైక్యంగా ఉండేదనీ, వాటిని ఏకతాటిపైకి తెచ్చిన ఘనత మరియాకు దక్కుతుందనీ నోబెల్ కమిటీ చైర్మన్ జోర్గెన్ వాట్నే ఫ్రీడెన్స్ పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలను ఏకం చేసి స్వేచ్ఛాయుతమైన ఎన్నికల కోసం, ప్రాతినిధ్య ప్రభుత్వం కోసం డిమాండ్ లేవనెత్తిన వ్యక్తిగా ఆమెను కొనియాడారు. ఇక మచాడో చేసిందేమిటీ? వెనిజులా 'పోరాటానికి గొప్ప సహకారాన్నందించిన' ట్రంప్ గారికి తన నోబెల్ శాంతి బహుమతిని అంకితం చేసేశారు.

వెనిజులా ప్రతిపక్షం ఒకప్పుడు అనైక్యంగా ఉండేదనీ, వాటిని ఏకతాటిపైకి తెచ్చిన ఘనత మరియాకు దక్కుతుందనీ నోబెల్ కమిటీ చైర్మన్ జోర్గెన్ వాట్నే ఫ్రీడెన్స్ పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలను ఏకం చేసి స్వేచ్ఛాయుతమైన ఎన్నికల కోసం, ప్రాతినిధ్య ప్రభుత్వం కోసం డిమాండ్ లేవనెత్తిన వ్యక్తిగా ఆమెను కొనియాడారు. ఇక మచాడో చేసిందేమిటీ? వెనిజులా 'పోరాటానికి గొప్ప సహకారాన్ని అందించిన' ట్రంప్ గారికి తన నోబెల్ శాంతి బహుమతిని అంకితం చేసేశారు. మొత్తానికి 'శాంతి రాయబారి'గా నోబెల్ శాంతి బహుమతి ఎవరికి దక్కినట్టూ? వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను తొలగించడానికి సైనిక జోక్యాన్ని కోరుతూ 2018లో ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి నెతన్యాహుకు లేఖ రాసినావిడకు దక్కినట్టు!

మొత్తానికి 'శాంతి రాయబారి'గా నోబెల్ శాంతి బహుమతి ఎవరికి దక్కినట్టూ? వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను తొలగించడానికి సైనిక జోక్యాన్ని కోరుతూ 2018లో ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి నెతన్యాహుకు లేఖ రాసినావిడకు దక్కినట్టు!

అంతేకాకుండా, 2020 జులై 21న, మచాడో పార్టీ వెంటే వెనిజులా అధికారికంగా నెతన్యాహు లికుడ్ పార్టీతో ఒక ఒప్పందంపై సంతకం చేసింది. ఒప్పంద పత్రంలో స్పష్టంగా ఇలా వుంది: 'రాజకీయ, సైద్ధాంతిక, సామాజిక విషయాలపై పరస్పరం సహకరించుకోడానికి మా ఇరువర్గాలూ కట్టుబడి ఉన్నాయి. అలానే వ్యూహాత్మక, భౌగోళిక రాజకీయ, భద్రతా సమస్యలపై పరస్పరం సహకరించుకోడానికై ఒక కూటమిని ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి కూడా మేము కట్టుబడి ఉన్నాము.' 'ఇజ్రాయిల్ ప్రజలను వెనిజులా ప్రజలకు మరింత దగ్గరకు తీసుకురావడమే మా లక్ష్యం.' అని కూడా అందులో రాసుకున్నారు.

జనవరి 2009లో, గాజాలో ఇజ్రాయిల్ ఊచకోతకు నిరసనగా కారకాస్ (వెనిజులా రాజధాని) టెల్ అవీవ్‌తో (ఇజ్రాయిల్ రాజధాని) అన్ని దౌత్య సంబంధాలనూ తెంచుకుంది. హ్యూగో చావెజ్ అప్పుడు అధ్యక్షుడిగా ఉన్నాడు. చావెజ్ గతంలో ఇజ్రాయిల్ రాయబారిని కారకాస్ నుండి బహిష్కరించాడు కూడా. ఈ సంవత్సరం జనవరిలో, మాజీ అధ్యక్ష అభ్యర్థులు ఎడ్మండో గొంజాలెజ్, మచాడో... ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రి గిడియాన్ సాయర్‌తో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫిబ్రవరి 15న గొంజాలెజ్, సాయర్ జర్మనీలో సమావేశమయ్యారు. గొంజాలెజ్ అక్కడ ఇజ్రాయిల్‌ను సందర్శించాలన్న తన కోరికను వ్యక్తపరిచాడు.

ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన అధ్యక్షుడిని తొలగించేందుకు వెనిజులాలో 2002లో ఒక తిరుగుబాటు జరిగింది. తాత్కాలికంగా ముగిసిన ఈ తిరుగుబాటుకు నాయకత్వం వహించిన వారికి సహకరించారు మరియా మచాడో. రాజ్యాంగాన్ని పూర్తిగా తుడిచిపెట్టిన కార్మోనా డిక్రీపై ఆమె సంతకం చేశారు. ఆ డిక్రీ ప్రకారం ప్రతి ప్రభుత్వ సంస్థనూ రాత్రికి రాత్రే రద్దు చేశారు. కారకాస్‌లో పాలనా మార్పును సమర్థించడానికి ఆమె వాషింగ్టన్‌తో చేయి చేయి కలిపి పనిచేశారు. బలవంతంగా వెనిజులాను 'విముక్తి' చేయడానికి విదేశీ సైనిక జోక్యానికి ఆమె పిలుపునిచ్చారు. వెనిజులాపై దాడి చేస్తానన్న ట్రంప్ బెదిరింపునూ, కరేబియన్‌లో అమెరికా దళాలను మోహరించడాన్నీ ప్రశంసించారు. ట్రంప్ యుద్ధ నౌకలను పంపినప్పుడు, వాటికి స్థానిక ప్రతినిధిగా వ్యవహరించడానికి సిద్ధపడ్డారు. వెనిజులా సార్వభౌమత్వాన్ని తాకట్టు పెట్టడానికి అంగీకరించారు. జెరూసలెంలో వెనిజులా రాయబార కార్యాలయాన్ని తిరిగి ప్రారంభిస్తానని హామీ ఇచ్చారు. తన దేశ చమురు, నీరు, మౌలిక సదుపాయాలన్నీ ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలనుకుంటున్నారామె. ఈ పద్ధతిలోనే 1990లలో లాటిన్ అమెరికా నయా ఉదారవాదానికి ప్రయోగశాలగా మారింది.

అంచేత, 'వెనిజులా పోరాటం ఇజ్రాయిల్ పోరాటమే' అని మచాడో ప్రకటించినప్పుడు, ఆమె వాస్తవానికి అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వెనిజులా చేస్తున్న నిజమైన పోరాటాన్ని మరుగున పడేయడానికి ప్రయత్నించారు. వెనిజులా ఇప్పటికీ ప్రతి కోణంలోనూ పాలస్తీనాకు తోడుగా ఉంది. మచాడోకు శాంతి బహుమతిని ప్రదానం చేయడమంటే నోబెల్ కమిటీ నెతన్యాహూ మారణహోమాన్ని విస్మరిస్తున్నట్టే!

రెండేళ్లలో జరిగిన మారణహోమంలో అధికారిక సంఖ్య ప్రకారం కనీసం 67,000 మంది పాలస్తీనియన్లు బలయ్యారు. అంటే ప్రతి 33 మందిలో ఒకరు! లేదా ఇజ్రాయిల్ దాడికి ముందు జనాభాలోని 3 శాతమన్నమాట. కనీసం 20,000 మంది పిల్లలు మరణించారు. గత 24 నెలల్లో ప్రతి గంటకు ఒక శిశువు మరణించినట్టే! గాయపడిన వారి సంఖ్య 169,000! అంటే ప్రతి 14 మందిలో ఒకరు! 'ది లాన్సెట్' (జులై 2024) అధ్యయనం ప్రకారం ప్రత్యక్ష దాడుల వల్ల అధికారిక మరణాల సంఖ్య వాస్తవ సంఖ్యలో 20 శాతం మాత్రమే! అంటే వాస్తవ మరణాల సంఖ్య 335,000. రోజుకు 450 మంది! ఇదే సమయంలో 125 ఆసుపత్రులూ, క్లినిక్‌లూ ధ్వంసమయ్యాయి! 1,722 మంది ఆరోగ్య కార్యకర్తలు మరణించారు. గాజాలోని నీటి, మురుగునీటి వ్యవస్థల్లో 89 శాతం నేడు దెబ్బతిన్నాయి! 92 శాతం నివాస భవనాలు నేలమట్టమయ్యాయి. 10,800 మంది పాలస్తీనియన్ ఖైదీలు ఇజ్రాయిల్ జైళ్లలో ఉన్నారు. 300 మంది జర్నలిస్టులు, వార్తా కార్యకర్తలు చంపబడ్డారు. వీరిలో, కేవలం అల్-జజీరాకు చెందిన వారే 10 మంది ఉన్నారు ('అల్-జజీరా' వార్త).

ఇది శాంతితో చేస్తున్న పరిహాసం లాంటిది! లేదా, శాంతి గురించి ఒక క్రూరమైన జోక్ అనుకోవచ్చు! నిజానికి కారకాస్‌లో అధికార మార్పిడి కోసం వాషింగ్టన్ చేతి ఆయుధం మచాడో. ఏకపక్ష ఆంక్షలకూ, ప్రైవేటీకరణకూ, విదేశీ జోక్యానికీ అవసరమైన తెలివైన ప్రతినిధి ఆమె!

నిజానికి ఫాసిజం, జియోనిజం, నయా ఉదారవాదాల ప్రపంచీకరణ కూటమిలో భాగం మచాడో. హెన్రీ కిస్సింజర్ నోబెల్ గెలుచుకున్నప్పుడు మచాడో ఎందుకు గెలవకూడదూ? బహుశా వచ్చే ఏడాది నెతన్యాహుకు ఈ అవార్డు దొరకవచ్చు!

('మార్క్సవాదీ పథ్' బెంగాలీ పత్రిక, అక్టోబర్, 11, 2025)

/ బెంగాలీ నుంచి తెలుగు : బాలాజీ (కోల్‌కతా)/

★

పర్యావరణ ప్రమాణాలు గాలికి

వ్యాఖ్య



కార్పొరేట్ కంపెనీల కోసం పర్యావరణ నిబంధనలను మోడీ ప్రభుత్వం మార్పు చేసింది. ప్రజాభిప్రాయ సేకరణ అవసరం లేకుండా కార్పొరేట్లకు లబ్ధి జరిగేలా చేసింది. ప్రత్యేకంగా అదాని కోసం సొంత క్యాప్టివ్ ప్లాంట్ లేని సిమెంట్ గ్రైండింగ్ యూనిట్లకు ముందస్తు అనుమతులు, పర్యావరణ అనుమతులు అవసరం లేదని నిబంధనలు సవరిస్తూ కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ముసాయిదా నోటిఫికేషన్ విడుదల చేసింది. నూతన నిబంధనలు అమలు లోకి వస్తే పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక (ఇఐఎ) రిపోర్టు తయారు చేయాల్సిన అవసరం వుండదు. ప్రజలకు హానికరంగా నిబంధనలు సవరించి కార్పొరేట్లకు ప్రయోజనం చేకూర్చడానికి సిద్ధపడింది.

రాష్ట్రంలో లక్షల కోట్ల పెట్టుబడులతో వచ్చే పరిశ్రమల్లో వేలాది మందికి ఉపాధి కలగనుందని ప్రభుత్వం చెబుతున్న మాటలను ప్రజలు విశ్వసించడం లేదు. పైగా, ఆ పరిశ్రమల ఏర్పాటు కోసం జరిగే ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలన్న డిమాండ్‌పై ఏకమవడం నూతన పరిణామం. ఉపాధి పేరుతో మోసగించి కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు లబ్ధి చేకూర్చాలన్న ప్రభుత్వ తాపత్రయానికి ప్రజా పోరాటాలు బ్రేకులు వేస్తున్నాయి. తమ ఆధీనంలోని పోలీసు బలగాలతో ప్రజలను భయపెట్టేందుకు చేసిన ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. ప్రజల ఆగ్రహం ముందు అణచివేత, నిర్బంధ చర్యలు సాగవని జన సమూహాలు పాలకులను హెచ్చరిస్తున్నాయి.



గనిశెట్టి సత్యనారాయణ

పరిశ్రమలకు ఒకనాడు భూములిచ్చిన రైతులు ఇపుడెందుకు ససేమిరా ఇవ్వమంటున్నారు? అన్న ప్రశ్నకు ప్రభుత్వాల దగ్గర జవాబులు లేవు. కానీ భూములిచ్చి, ఉపాధి లేక బతుకు తెరువుకు ఊరూవాడా తిరుగుతున్న రైతులు, పేదలు, మత్స్యకారులు, చేతివృత్తిదారులకు అనేక చేదు అనుభవాలున్నాయి. నేర్చుకున్న జీవిత పాఠాలున్నాయి. గూడు కట్టుకున్న బాధలున్నాయి. ఈ క్రమంలోనే ప్రైవేటు పరిశ్రమల ఏర్పాటుకు వ్యతిరేకంగా తమ అభిప్రాయాలను నిరసన రూపంలో ప్రజాభిప్రాయ సేకరణలో తెలియజేస్తున్నారు.

అనకాపల్లి జిల్లాలోని సక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్కు వద్దంటే వద్దని ప్రజలు ఏక కంఠంతో చెప్పినా ప్రభుత్వం పెడచెవిన పెడుతోంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పించిన ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను దెబ్బ తీసి ప్రైవేటీకరించేందుకు, స్థానికుల ఉపాధిపై ఊసెత్తని ఆర్సెలార్ మిట్టల్‌ను ప్రోత్సహించే ప్రభుత్వ కుట్రలను అర్థంచేసుకున్న ప్రజలు కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో తమ అభ్యంతరం తెలిపారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి ప్రాంతంలో ఏర్పాటు కానున్న ఈ పరిశ్రమలను ప్రజలు వ్యతిరేకిస్తుంటే, పెట్టి తీరాలని ప్రభుత్వం మొండిగా వుంది. పోలీసులను చూపి వెనక్కు తగ్గేలా చేయాలని ప్రభుత్వం చూస్తే, ఆ ఆలోచన విరమించుకొనేలా ఒత్తిడి పెంచాలని నిర్వాసితులు, బాధిత మత్స్యకారులు, ప్రజలు భావించారు. కొద్ది రోజుల క్రితం ఆ ప్రాంత పర్యటనకు వెళ్లిన మంత్రి వాహనం ముందు తాటిచెట్టు అడ్డంపెట్టి మరీ పోరాడారు. ప్రజాపోరాటంతో తాత్కాలికంగా పనులు నిలిపివేస్తున్నట్టు మంత్రి ప్రకటించాల్సి వచ్చింది. విశాఖపట్నం జిల్లా పెదగంట్యాడ మండలంలో గంగవరం పోర్టు ఆవరణలో అదానీకి చెందిన అంబూజా సిమెంట్ గ్రైండింగ్ పరిశ్రమ ఏర్పాటుకు పెట్టిన ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేసినట్లు అధికార యంత్రాంగం ప్రకటన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సొంత నియోజకవర్గం గాజువాక పరిధిలోని పెదగంట్యాడ ప్రాంతంలో ప్రజలు తిరగబడ్డారు. అదానీ కొమ్ముగాసే ప్రభుత్వ ఆటలు ఇక్కడ సాగనివ్వబోమని... సిపిఎం, వామపక్షాలు ప్రజల పక్షాన నిలబడ్డాయి.

అదానీకి చెందిన గంగవరం పోర్టు ధూళి, దుమ్ముతో భరించలేని కాలుష్యంతో బాధపడుతున్న ప్రజల్లో అంబూజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుపై ఆగ్రహం వెల్లువెత్తింది. రాష్ట్రంలో తీరప్రాంతం, సెజ్‌లో ఏర్పాటైన ఔషధ, రసాయన పరిశ్రమలతో ఆ పరిసర ప్రాంత ప్రజలకు పీల్చే గాలి, తాగే నీరు ప్రమాదకరంగా మారాయి. ప్రాణాంతక వ్యాధులకు అవి కేంద్రంగా వున్నాయి. పర్యావరణ పరిరక్షణ బాధ్యతను అటు ప్రభుత్వమూ, ఇటు పరిశ్రమాధిపతులు పూర్తిగా వదిలేశారు. కోట్ల విలువైన రాయితీలు, సదుపాయాలు కల్పించి పరిశ్రమాధిపతులకు లాభాలు సమకూర్చడంపైనే ప్రభుత్వాలు శ్రద్ధ చూపుతున్నాయి. ఆ పరిశ్రమలకు భూములిచ్చిన రైతులు, ఉపాధి కోల్పోయిన పేదలు, వృత్తిదారులను విస్మరించాయి.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని ముందుకు తెచ్చి ప్రజలకు కనీస భద్రత లేకుండా చేసింది మోడీ, చంద్రబాబు డబుల్ ఇంజన్ సర్కారు. కార్పొరేట్లు, పెట్టుబడిదారులు చట్టబద్ధ నియంత్రణలను పాటించాల్సిన అవసరం లేకుండా చేస్తున్నాయి ఈ ప్రభుత్వాలు. గాలిని, నీటిని కలుషితం చేస్తున్నా పట్టించుకోవడం మానేశాయి. చివరకు కాలుష్య నియంత్రణ మండలి, ఫ్యాక్టరీల అధికారుల తనిఖీలపై ఆంక్షలు విధించి విచ్చలవిడితనానికి అవకాశం కల్పించాయి.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో అత్యంత ప్రమాదకరమైన ఫ్యాక్టరీల జాబితాలో 386 పరిశ్రమలున్నట్లు 2023లో అధికార యంత్రాంగం గుర్తించింది. గత ఐదేళ్లలో 110 పరిశ్రమలకు నోటీసులు జారీ చేశారు. విశాఖ నగర వాసుల ఆరోగ్యాలను కాలుష్యంతో దెబ్బ తీస్తున్న విశాఖపట్నం పోర్టు ట్రస్ట్, గంగవరం పోర్టును పర్యావరణ ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవడం లేదు. ఎన్.టి.పి.సి కాలుష్యంతో మూల స్వయంవరం, సోమినాయుడుపాలెం ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. పరవాడ జవహర్ లాల్ నెహ్రూ ఫార్మా సిటీకి అనుకొనివున్న గ్రామాలు వాయు కాలుష్యంతో తల్లడిల్లుతున్నాయి. పరిశ్రమలు వ్యర్థ రసాయన జలాలను శుద్ధి చేయకుండా చెరువుల్లోకి విడిచిపెడుతున్నాయి. ఘన వ్యర్థాలను ఆరుబయట విడిచిపెట్టిన ఫార్మా సిటీ డెవలపర్ ర్యాంకీ యాజమాన్యానికి కాలుష్య నియంత్రణ అధికారులు నోటీసులు జారీ చేసినా... చర్యలేమీ తీసుకోలేదు. ముత్యాలమ్మపాలెం ఉప్పుటేరు కాలుష్యమయమైంది. అచ్యుతాపురం సెజ్ లోని సిఇటిపి వ్యర్థాలను శుద్ధి చేయకుండా పూడిమడక వాగులోకి వదిలేయడంతో చేపలు చనిపోయి మత్స్యకారులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. విచారణలో వ్యర్థాలను శుద్ధి చేయడంలేదని తేలడంతో నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేసినప్పుడు స్పందించినా తర్వాత మామూలే. తిరిగి ప్రమాణాలను ఉల్లంఘిస్తున్నారు. బ్రాండెక్స్ దుస్తుల కంపెనీలో 2022 జూన్ మూడున విష వాయువులు లీకై 410 మంది కార్మికులు అస్వస్థతకు గురైనా యాజమాన్యంపై చర్యల్లేవు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ 2023 డిసెంబర్‌లో ఆరు కోట్ల 94 లక్షల రూపాయల అపరాధ రుసుము హెటిరో డ్రగ్స్ మందుల కంపెనీకి విధించినా ఏ మార్పు లేదు. పరవాడ ఫార్మా సిటీ పక్కనున్న తాడి గ్రామాన్ని తరలిస్తామని పాలకులు ఊరించడమే తప్ప ఆచరణ లేదు. కాకపోతే కంటి తుడుపుగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలతో ఇంటికి 20 లీటర్ల మంచినీటిని సరఫరా చేస్తున్నారు.

కార్పొరేట్ కంపెనీల కోసం పర్యావరణ నిబంధనలను మోడీ ప్రభుత్వం మార్పు చేసింది. ప్రజాభిప్రాయ సేకరణ అవసరం లేకుండా కార్పొరేట్లకు లబ్ధి జరిగేలా చేసింది. ప్రత్యేకంగా అదాని కోసం సొంత క్యాప్టివ్ ప్లాంట్ లేని సిమెంట్ గ్రైండింగ్ యూనిట్లకు ముందస్తు అనుమతులు, పర్యావరణ అనుమతులు అవసరం లేదని నిబంధనలు సవరిస్తూ కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ముసాయిదా నోటిఫికేషన్ విడుదల చేసింది. నూతన నిబంధనలు అమలు లోకి వస్తే పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక (ఇఐఎ) రిపోర్టు తయారు చేయాల్సిన అవసరం వుండదు. ప్రజలకు హానికరంగా నిబంధనలు సవరించి కార్పొరేట్లకు ప్రయోజనం చేకూర్చడానికి సిద్ధపడింది. ఈ నిబంధనలు. అమలు కాకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై వుంది. ప్రజల ఆరోగ్యాలు దెబ్బ తినకుండా వుండాలంటే పర్యావరణ ప్రమాణాలను పరిశ్రమలు పాటించేలా నిబంధనలు కఠినతరం చేయాలి. ప్రమాణాల అమలుకు స్థానిక ప్రజలతో విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు చేయాలి.

/ వ్యాసకర్త 'ఫార్మా సిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్' గౌరవ అధ్యక్షులు, సెల్ : 9247335058 /

★

అభిప్రాయం

బదిలీ అయినా అక్కడే

రాష్ట్రంలో డిఎస్సీ 2025 నియామకాలు పూర్తి కావస్తున్నాయి. అంతర్ జిల్లా బదిలీలు పూర్తయ్యాయి. వారు కూడా కొత్త స్థానాల్లో చేరారు. కానీ కొందరు ఉపాధ్యాయులు బదిలీ అయినా రిలీవర్ లేక పాత స్థానాల్లో అలానే కొనసాగుతున్నారు. ఇది అన్యాయం. ప్రభుత్వం తగు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి. వారు కొత్త స్థానాల్లో పనిచేసేలా చర్యలు తీసుకోవాలి. వారిని వెంటనే రిలీవ్ చేయాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా.

పాఠ్యాంశంగా సహ చట్టం

ప్రభుత్వ పాలన పారదర్శకంగానూ జవాబుదారీతనంగాను ఉండేందుకు సమాచార హక్కు చట్టాన్ని 2005లో తీసుకొచ్చారు. ఇది ప్రజలకు చాలా మంచి చట్టం. మండల ప్రాంతంలో అయితే మన అప్లికేషన్ పైన ఐదు రూపాయల తోకబిళ్ళ, పట్టణ ప్రాంతంలో అయితే పది రూపాయలు తోకబిళ్ళ అతికించి అధికారికి పంపాలి. మనం కోరిన సమాచారాన్ని 30 రోజుల లోపు సంబంధిత అధికారి ఇవ్వాలి. లేనిపక్షంలో మొదటి అప్పిల్లేట్ అధికారికి ఫిర్యాదు చేయాలి. ఆయన కూడా ఇవ్వనిపక్షంలో కమిషన్‌కు ఫిర్యాదు చేయాలి. ఆయన కూడా న్యాయం చెయ్యకపోతే హైకోర్టుకు వెళ్ళవచ్చు. ఇది చట్టం చెప్తుంది. అయితే మొదటి నుండి కొంతమంది అధికారులు ఈ చట్టాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. కనుక ఇంతటి ముఖ్యమైన చట్టం గురించి చిన్నప్పటి నుండే విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చినట్లైతే, చట్టం పట్ల అవగాహన పెరుగుతుంది. మంచి సమాజం ఏర్పడేందుకు అవకాశం ఉంటుంది. వెంటనే సమచార హక్కు చట్టాన్ని విద్యార్థులకు పాఠ్యాంశంగా పెట్టేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

- నార్నె వెంకట సుబ్బయ్య.

నార్వే, ఆస్ట్రేలియాలో వెనిజులా దౌత్యకార్యాలయాల మూసివేత

కారకస్ : నార్వే, ఆస్ట్రేలియాలో తమ దౌత్య కార్యాలయాలు మూసివేస్తున్నట్లు వెనిజులా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రకటించింది. దౌత్య కార్యకలాపాల అంతర్గత పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. జింబాబ్వే, బుర్కినా ఫాసోలో రాయబార కార్యాలయాలు ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. అమెరికా అండదండలతో వెనిజులాలో ప్రజాస్వామిక ఎన్నికల వ్యవస్థను అడ్డుకునేందుకు ప్రయత్నించిన మచాడోకు నోబెల్ శాంతి బహుమతి ప్రకటించడంపై వెనిజులా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

ఢిల్లీలో దారుణం

ఎస్ఎయు విద్యార్థిపై గ్యాంగ్‌రేప్



న్యూఢిల్లీ : దేశ రాజధాని న్యూఢిల్లీలో మహిళలకు రక్షణ లేకుండా పోతోంది. డబుల్ ఇంజిన్ బిజెపి ప్రభుత్వ ఏలుబడిలో అఘాయిత్యాలు, ఆకృత్యాలు పెరిగిపోతున్నాయి. తాజాగా దక్షిణాసియా విశ్వవిద్యాలయం (ఎస్ఎయు) విద్యార్థిపై నలుగురు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధిత విద్యార్థి ఆదివారం నుంచి కనిపించడం లేదని సహచరులు ఎస్ఎయు యాజమాన్యానికి సమాచారం అందించినా..పట్టించుకోలేదు. చివరికి ఆమెను సోమవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలోనే గాయాలతో గుర్తించారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. ఆమెపై సామూహిక అత్యాచారం జరిగిందని తెలుసుకున్న విద్యార్థులు ఎస్ఎయు అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించారని, పోలీసులకు సమాచారం ఇవ్వడంలో జాప్యం చేశారని విద్యార్థులు వాపోయారు. ఈ ఘటనపై మైదాన్ గర్హి పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, దర్యాప్తు కొనసాగుతోందని డిసిపి (సౌత్) అంకిత్ చౌహాన్ తెలిపారు. ఢిల్లీలో ఈ ఏడాది ఆగస్టులో ఒక ప్రైవేటు స్విమ్మింగ్ పూల్ వద్ద తొమ్మిదేళ్ల వయస్సు ఉన్న ఇద్దరు బాలికలపై సామూహిక అత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అదే నెలలో 24 ఏళ్ల మహిళకు మత్తు మందు ఇచ్చి కొంతమంది వ్యక్తులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఢిల్లీలో వరుసగా చోటుచేసుకుంటున్న అఘాయిత్యాలపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

4 కన్వెన్షన్ సెంటర్లకు అనుమతి

- పదెకరాలు కేటాయింపు
- మందడం, తుళ్లూరు, లింగాయపాలెంలో ఏర్పాటు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి పరిధిలో నాలుగు కన్వెన్షన్ సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ మేరకు పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. నాలుగు సంస్థలకు గతంలోనే పదెకరాలు కేటాయించింది. వీటిల్లో జివి ఎస్టేట్స్, మాలక్ష్మి ఇన్‌ఫ్రా సంస్థ మందడంలోనూ, ఓంశ్రీ భావనసాయి అసోసియేట్స్ తుళ్లూరులోనూ, వరుణ్ హాస్పిటాలిటీ లింగాయపాలెంలోనూ కన్వెన్షన్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నాయి. జివి ఎస్టేట్స్‌కు మందడంలో సర్వే నెంబరు 195లో 1.60 సెంట్లు, 198లో 90 సెంట్లు పార్సిల్ నెంబరు ఒకటిలో ఇచ్చారు. మాలక్ష్మి ఇన్‌ఫ్రాకు సర్వే నెంబరు 223లో సెంటు, 236లో 2.49 సెంట్లు కేటాయించారు. ఓంశ్రీ భావనసాయి అసోసియేట్స్‌కు తుళ్లూరులో సర్వే నెంబరు 188లో సెంటు, 186లో 2.49 సెంట్లు పార్సిల్ నెంబరు మూడులో ఇచ్చారు. వరుణ్ నోవాటెల్‌కు లింగాయపాలెంలోని సర్వే నెంబరు 58లో 26 సెంట్లు, 156లో 1.84 సెంట్లు కేటాయించారు. ఈ నెల 8న జరిగిన సిఆర్‌డిఎ అథారిటీ 53వ సమావేశంలో 589 తీర్మానం కింద ఈ కేటాయింపులు జరిపారు.

రాజ్‌భవన్ నిర్మాణానికి రూ.212 కోట్లు

ప్రభుత్వ కోర్ ఏరియాలో రాజ్‌భవన్ నిర్మాణానికి రూ.212.22 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సిఆర్‌డిఎ 53వ సమావేశంలో 593వ తీర్మానం కింద ఈ కేటాయింపులు జరిపినట్లు పేర్కొంది. ఇందులో గవర్నర్ మాన్షన్, అసెంబ్లీ దర్బార్ హాల్, గవర్నర్ ఆఫీసు, రెండు గెస్ట్‌హౌస్‌లు నిర్మించనున్నారు. దీంతోపాటు అధికారుల, సీనియర్, జూనియర్ స్టాఫ్ కోసం భవనాలు నిర్మించనున్నారు. దీనికి వెంటనే టెండర్లు పిలవాలని నిర్ణయించారు.

పరకామణి కేసులో డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్న సిఐడి

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

తిరుమల పరకామణి కేసులో హైకోర్టు ఆదేశాల మేరకు సిఐడి విచారణ వేగవంతం చేసింది. విజయవాడ నుంచి వచ్చిన సిఐడి బృందం మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. అనంతరం పరకామణి కేసు పూర్వపరాలను తిరుమల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో పరిశీలించింది. లోక్‌అదాలత్ కేసుపై ఆరా తీసింది. ఈ కేసులో రాజీ వివరాలను, నిందితుడు రవికుమార్‌కు అనుకూలంగా టిటిడి బోర్డులో చేసిన తీర్మానాలను పరిశీలించింది. ఆ కేసుకు సంబంధించిన రికార్డులన్నీ స్వాధీనం చేసుకున్నామని, వాటిని హైకోర్టుకు అప్పగిస్తామని సిఐడి డిఐజి మీడియాకు చెప్పారు.

నాన్‌వెజ్ వడ్డించినందుకు పదేళ్ల తర్వాత ఉపాధ్యాయుడిపై వేటు

- గుజరాత్‌లో బిజెపి ప్రభుత్వం నిర్వాకం

సూరత్ : దాదాపు పదేళ్ల క్రితం స్కూల్లో జరిగిన గెట్ టు గెదర్ పార్టీలో నాన్‌వెజ్ వడ్డించినందుకు ఒక ఉపాధ్యాయుడిపై కక్షకట్టి వేటువేసిన ఉదంతమిది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం బిజెపి పాలిత గుజరాత్‌లోని సూరత్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు ప్రభాకర్ పదేళ్ల క్రితం పాఠశాల పూర్వ విద్యార్థుల కోసం గెట్ టు గెదర్ పార్టీ నిర్వహించారు. ఆ పార్టీలో నాన్‌వెజ్ వంటకాల్ని వడ్డించారు. ఇది గుజరాత్ పాఠశాల నిబంధనలకు విరుద్ధం. ఆయన పాఠశాల నిబంధనల్ని ఉల్లంఘించినట్లు తాజాగా మీడియా ద్వారా తెలిసింది. దీంతో వెంటనే ఈ సంఘటనకు సంబంధించిన విషయాన్ని నిర్ధారించుకుని ఇప్పుడు మున్సిపల్ ప్రాథమిక విద్యా కమిటీ ప్రభాకర్‌ని సస్పెండ్ చేసింది. ఈ విషయాన్ని మున్సిపల్ ప్రైమరీ ఎడ్యుకేషన్ కమిటీ ఛైర్మన్ రాజేంద్ర కపాడియా తెలిపారు. దీనిపై కపాడియా మీడియాతో మాట్లాడుతూ.. స్కూల్ లోపలికి నాన్‌వెజ్ వంటకాల్ని అనుమతించడం నిబంధనలకు విరుద్ధమని అన్నారు.

క్యూబా కేంద్రంగా అంతర్జాతీయ సమావేశాలు

- ఆతిథ్యమివ్వనున్న హవానా

హవానా : ప్రపంచవ్యాప్తంగా వామపక్ష భావజాలానికి సంబంధించి మేథోపరమైన మార్పిడులు, అంతర్జాతీయ సంఘీభావం, విద్యావేత్తలను, కార్యకర్తలను, సాంస్కృతిక కళాకారులను ఒకే చోటకు తీసుకురావడానికి క్యూబా కేంద్రమవుతోంది. సమిష్టి వ్యూహాలు రూపొందించేందుకు, కీలకమైన అంశాలను పరిష్కరించేందుకు, సమానత్వం, సంఘీభావాన్ని, ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాన్ని పెంపొందించేందుకు ఉద్దేశించి రెండు అంతర్జాతీయ మహాసభలకు ఈ వారంలో క్యూబా ఆతిథ్యమిస్తోంది. 15 నుండి 17 వరకు వామపక్ష పార్టీలు, ఉద్యమాల సైద్ధాంతిక ప్రచురణల 3వ అంతర్జాతీయ సమావేశం హవానాలో జరుగుతోంది. 17 నుండి 19 వరకు మొట్టమొదటి గ్రాన్మా రెబెల్డ్ అంతర్జాతీయ ఉత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు క్యూబా సోషలిస్టా మ్యాగజైన్ డైరెక్టర్, పార్టీ కేంద్ర కమిటీ అధికారి అయిన లూయిస్ మోర్లెట్ పత్రికా సమావేశంలో తెలియచేశారు. ఈ రెండు మహాసభలకు 30కి పైగా దేశాల నుండి వందమందికి పైగా ప్రతినిధులు హాజరు కానున్నారని ఆయన చెప్పారు. క్యూబా సోషలిస్టా ఏర్పాటు చేసిన సైద్ధాంతిక ప్రచురణల అంతర్జాతీయ సమావేశానికి నెట్‌వర్క్ ఆఫ్ ఇంటెలెక్చువల్స్ అండ్ ఆర్టిస్ట్స్ ఇన్ డిఫెన్స్ ఆఫ్ హ్యూమానిటీ కూడా ఆతిథ్యం ఇస్తోంది. ప్రముఖ మేధావులు, కళాకారులు, రాజనీతి కోవిదులు అందరూ హాజరు కానున్నారని ఆయన చెప్పారు. క్వాంటమ్ కృత్రిమ మేధస్సుతో వామపక్షాలకు ఎదురవుతున్న సవాళ్ళను పరిష్కరించడంపై కీలకోపన్యాసం కూడా జరగనుంది.

71 మందితో బిజెపి తొలిజాబితా

పాట్నా : బీహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం బిజెపి తన తొలి జాబితాను మంగళవారం విడుదల చేసింది. ఈ జాబితాలో 71 స్థానాలకు పేర్లను ప్రకటించింది. ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీ తారాపుర్ నుంచి పోటీ చేయనున్నారు. మరో డిప్యూటీ సిఎం విజయ్‌కుమార్ సిన్హా లఖిసరాయ్ నుంచి బరిలో దిగనున్నారు. మంత్రులు నితిన్ నబీన్.. బాంకీపుర్, రేణు దేవీ.. బేతియా, మంగల్ పాండే సీవాన్ నుంచి పోటీ చేయనున్నారు. అయితే స్పీకర్ నంద కిషోర్‌కు టికెట్ నిరాకరించారు. ఆయన స్థానం పాట్నా సాహిబ్ నుంచి నూతన అభ్యర్థి రత్నేష్ కుషావాను ప్రకటించారు. ఈ ఎన్నికల్లో మొత్తం 101 స్థానాల్లో బిజెపి పోటీ చేయనున్న విషయం తెలిసిందే.

బిజెపి పాలనలో రక్షణ కరువు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. 13 గంటల పని విధానాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేయడానికి సిద్ధపడడం అమానవీయమైన చర్య అని అన్నారు. మనువాదాన్ని దేశంలో అమలు చేయాలని బిజెపి చూస్తోందని, దీనివల్ల నష్టపోయేది మహిళలేనని తెలిపారు. మహిళలకు సమానహక్కులు కల్పించడానికి మనువాదం అంగీకరించదన్నారు. దీనికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా పోరాటాన్ని ఐద్వా రూపొందిస్తుందని తెలిపారు. ఐద్వా జాతీయ అధ్యక్షులు శ్రీమతి టీచర్ మాట్లాడుతూ కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం మహిళాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని చెప్పారు. ప్రధానంగా విద్య, ఆరోగ్యంపై అక్కడి ప్రభుత్వం అన్ని రకాల చర్యలూ తీసుకుందన్నారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ మైక్రో ఫైనాన్స్ వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. డ్వాక్రా గ్రూపు మహిళలకు ఇచ్చిన హామీలు అమలు కావడం లేదన్నారు. బెల్ట్ షాపులు ఊరూరా వెలిశాయని తెలిపారు. ఈ అంశాలన్నింటిపైనా రాష్ట్ర మహాసభలో చర్చించి పోరాటానికి కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఐద్వా జాతీయ కోశాధికారి పుణ్యవతి, రాష్ట్ర కోశాధికారి సావిత్రి పాల్గొన్నారు.

ఉప్పునీటితో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- చనిపోయిన ఒక్కో కొబ్బరి చెట్టుకు రూ.10 వేలు పరిహారం చెల్లించాలి
- సిపిఎం బృందం పర్యటనలో దడాల సుబ్బారావు


కేశనపల్లిలో ఉప్పునీటి వల్ల నష్టపోయిన కొబ్బరి తోటను పరిశీలిస్తున్న సిపిఎం బృందం

ప్రజాశక్తి - రాజోలు

శంకరగుప్తం డ్రెయిన్ నుంచి వచ్చే ఉప్పునీటి వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, కొబ్బరి చెట్లను కోల్పోయిన రైతులకు ఒక్కో చెట్టుకు రూ.10 వేలు నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కేశనపల్లిలో సిపిఎం బృందం పర్యటించింది. కేశనపల్లి ఉప్పుటేరు వల్ల నష్ట పోయిన కొబ్బరి తోటలను బృందం పరిశీలించింది. అనంతరం దడాల సుబ్బారావు మాట్లాడుతూ మలికిపురం మండలం కేశనపల్లి, శంకరగుప్తం, చింతల మోరి ప్రాంతాల్లో ఉప్పునీరు వల్ల పంటలను కోల్పోయారని తెలిపారు. శంకరగుప్తం డ్రెయిన్ వల్ల ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. ఈ డ్రెయిన్‌లో కొంత దూరం లోతుగా డ్రెడ్జింగ్ చేశారు. సుమారు ఎనిమిది కిలోమీటర్ల డ్రెడ్జింగ్ చేయకుండా వదిలేశారు. డ్రెడ్జింగ్ చేసిన చోట సముద్రపునీరు చేరి నిల్వ ఉండిపోయింది. ఈ నీరు భూమిలో ఇంకిపోవడంతో భూగర్భజలాలు ఉప్పునీరుగా మారాయని, ఫలితంగా కొబ్బరి చెట్లు చనిపోయాయని తెలిపారు. దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. డ్రెడ్జింగ్‌ను లోతుగా చేయడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందన్నారు. డ్రెడ్జింగ్ పనులను తగు మోతాదులోనే పూర్తి చేయాలన్నారు. ఎక్కువ లోతు తవ్వకూడదన్నారు. చెక్‌డ్యామ్‌లను నిర్మించి ఉప్పునీటి తీవ్రతను తగ్గించాలన్నారు. దీని కోసం జిప్సమ్‌ను రైతులకు ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతాల్లో తాగునీటి కొరత కూడా చాలా ఎక్కువగా ఉందన్నారు. పేదలు సైతం తాగునీరు నీరు కొనుక్కునే దుస్థితి వచ్చిందన్నారు. తక్షణమే ప్రభుత్వం తాగు, సాగు నీరు సరఫరా చేయాలన్నారు. లోతుగా డ్రెడ్జింగ్ చేయాలని ఎవరు సిఫార్సు చేశారో పరిశీలించాలన్నారు. నిపుణుల కమిటీని ఈ ప్రాంతానికి పంపి సమగ్ర సర్వే చేసి జరిగిన తప్పును సరిదిద్దాలన్నారు. పంటలను కాపాడేందుకు తక్షణం చర్యలు చేపట్టాలన్నారు. ఈ ప్రాంతంలో ఒఎన్‌జిసి విరివిగా బావులు తవ్వి వాటిని ఇసుకతో నింపకుండా వదిలేయడంతో భూమి కుంగిందన్నారు.

కేంద్ర ప్రభుత్వం తక్షణమే నివారణ చర్యలు చేట్టాలన్నారు. ఈ పర్యటనలో సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్, తాడి శ్రీరామ్మూర్తి, సిహెచ్.సూర్యప్రకాష్, గెడ్డం సాయిబాబు, సఖిలే సూర్యనారయణ, కారుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కురుపాం దుర్ఘటనపై 'సిట్'తో దర్యాప్తు జరిపించండి

- జాతీయ ఎస్‌టి కమిషన్‌కు వైసిపి విజ్ఞప్తి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలోని పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గిరిజన గురుకుల పాఠశాలలో జాండిస్ వల్ల 170 మంది విద్యార్థినుల అస్వస్థత, ఇద్దరు బాలికల మృతిపై సిట్‌తో దర్యాప్తు జరిపించాలని వైసిపి డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం నాడిక్కడ జాతీయ ఎస్‌టి కమిషన్ అంతర్‌సింగ్ ఆర్యకు అరకు ఎంపి తనూజారాణి, ఎమ్మెల్యే రేగా మత్స్యలింగం, విశాఖపట్నం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లి సుభద్ర, మాజీ డిప్యూటీ సిఎంలు పాముల పుష్పశ్రీవాణి, పీడిక రాజన్న దొర, మాజీ ఎమ్మెల్యే కె భాగ్యలక్ష్మి, పార్వతీపురం మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, మాజీ ఎంపి జి మాధవి, మాజీ జడ్‌పి ఛైర్‌పర్సన్ శోభా స్వాతిరాణితో కూడిన బృందం సభ్యులు వినతిపత్రం సమర్పించారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఒకే స్కూల్‌లో ఇద్దరు విద్యార్థినులు మృతి చెందడంతో పాటు, 170 మందికి పైగా జాండిస్ బారిన పడ్డారని వైసిపి ప్రతినిధుల బృందం వివరించింది. ఈ ఘటనపై కమిషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసి, విచారణ జరిపించాలని కోరారు. చనిపోయిన ఇద్దరు బాలికల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వడంతోపాటు, గిరిజన స్కూళ్లలో రక్షిత మంచినీటితో సహా, అన్ని సదుపాయాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.



లెక్సస్ ఇండియా కొత్త ఎల్ఎం 350హెచ్ విడుదల

న్యూఢిల్లీ : ప్రీమియం కార్ల తయారీ కంపెనీ లెక్సస్ కొత్తగా భారత మార్కెట్లోకి లెక్సస్ ఎల్ఎం 350హెచ్‌ను విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూం ప్రారంభ ధరను రూ.2.15 కోట్లుగా నిర్ణయించింది. ఇది అల్ట్రా లగ్జరీ మొబిలిటీ విభాగంలో సరికొత్త మైలురాయిగా నిలువనుందని లెక్సస్ ఇండియా అధ్యక్షుడు హికారు ఇకేచి పేర్కొన్నారు. మంగళవారం నుంచి దీని డెలివరీలను ప్రారంభించామన్నారు.

నాయిస్ మాస్టర్ బడ్స్ సిరీస్ విస్తరణ

హైదరాబాద్ : లైఫ్‌స్టైల్ ఉత్పత్తుల బ్రాండ్ నాయిస్ తన మాస్టర్ బడ్స్ సిరీస్‌ను విస్తరించినట్లు ప్రకటించింది. ఇందులో కొత్తగా సౌండ్ బై బోస్ టెక్నాలజీతో 'మాస్టర్ బడ్స్ మాక్స్'ను ఆవిష్కరించినట్లు తెలిపింది. అక్టోబర్ 14 నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో లభ్యం కానున్న వీటి ధరను రూ.9999గా నిర్ణయించింది. ఈ హెడ్‌ఫోన్స్ 60 గంటల వరకు బ్యాటరీ లైఫ్‌ను అందిస్తాయని నాయిస్ కో ఫౌండర్ అమిత్ ఖత్రి తెలిపారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర లాభాలు 23 శాతం వృద్ధి

ముంబయి : ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బిఒఎం) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో 23 శాతం వృద్ధితో రూ.1,633 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. మొండి బాకీలు తగ్గడంతో పాటుగా నికర వడ్డీ ఆదాయం పెరగడంతో మెరుగైన ఫలితాలను నమోదు చేయగలిగింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,327 కోట్ల లాభాలు ప్రకటించింది. ఇదే సమయంలో రూ.6,017 కోట్లుగా ఉన్న వడ్డీ ఆదాయం.. గడిచిన క్యూలో రూ.7,128 కోట్లకు పెరిగింది. 2025 సెప్టెంబర్ ముగింపు నాటికి బిఒఎం స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎ) 1.72 శాతానికి పరిమితమయ్యాయి. గతేడాది ఇదే సమయం నాటికి 1.84 శాతం జిఎన్‌పిఎ నమోదయ్యింది. నికర నిరర్థక ఆస్తులు 0.2 శాతం నుంచి 0.18 శాతానికి తగ్గాయి.

రెండో రోజూ మార్కెట్లకు నష్టాలు

ముంబయి : చైనా, అమెరికా మధ్య నెలకొన్న నూతన వాణిజ్య ఆందోళనలు, టారిఫ్‌ల పెంపు భయాలు మార్కెట్లను ఒత్తిడికి గురి చేస్తోన్నాయి. భారత ఆర్థిక వ్యవస్థలోనూ ఎలాంటి సానుకూల అంశాలు కానరాకపోవడంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపడంతో వరుసగా రెండో రోజూ సూచీలు నష్టాలను చవి చూశాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 297 పాయింట్లు లేదా 0.36 శాతం పతనమై 82,030కు పడిపోయింది. అదే బాటలో ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 81.85 పాయింట్లు లేదా 0.32 శాతం నష్టంతో 25,145 వద్ద ముగిసింది. బిఎస్‌ఇలో బజాజ్ ఫినాన్స్, ట్రెంట్, టాటా స్టీల్, బిఇఎల్ సూచీలు అధిక నష్టాలను చవి చూడగా.. టెక్ మహీంద్రా, ఐసిఐసిఐ బ్యాంక్, పవర్ గ్రిడ్, హెచ్‌యుఎల్ సూచీలు లాభాలను ఆర్జించిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మిడ్‌క్యాప్ సూచీ 0.75 శాతం, స్మాల్ క్యాప్ 0.89 శాతం చొప్పున నష్టపోయాయి.

విశాఖకు గూగుల్

(మొదటి పేజీ తరువాయి)

పూర్తవుతుందనకున్న ఎఐ హబ్ ఎంఒయు ఒక నెల ఆలస్యమైందన్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ గూగుల్ డేటా సెంటర్‌తో ఏపి ప్రభుత్వానికి రూ.10 వేల కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు.

ప్రధాని మోడీ హర్షం

విశాఖపట్నంలో గూగుల్ ఎఐ హబ్ ఏర్పాటు ఒప్పందంపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధానమంత్రి ట్వీట్ చేశారు. సాంకేతికతను ప్రజలందరికీ అందుబాటులోకి తేవడంలో విశాఖపట్నంలోని గూగుల్ ఎఐ హబ్ చాలా శక్తివంతంగా పనిచేస్తోందని అభివర్ణించారు. మన డిజిటల్ ఆర్థిక వ్యవస్థకి సహకరించడంతోపాటు సాంకేతికతలో ప్రపంచంలో ఇండియాని బలంగా నిలుపుతోందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. దీనికి ముందు గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్ స్పందిస్తూ విశాఖపట్నంలో గూగుల్ తొలి ఎఐ హబ్‌కు సంబంధించిన ప్రణాళిలను పంచుకునేందుకు ప్రధాని మోడీతో మాట్లాడానని, ఈ ఎఐ హబ్ ఓ కీలక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. విశాఖలో ఎఐ హబ్ ఏర్పాటుకు జరిగిన ఎంఒయుపై గౌతమ్ అదానీతో పాటు పలువురు స్పందించారు.

విశాఖకు గూగుల్ రావడం ఆనందదాయకం : గవర్నర్

గూగుల్ కంపెనీ విశాఖలో ఒక గిగావాట్ డేటా సెంటర్, ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్‌తో కూడిన అల్‌హబ్‌ను 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

గూగుల్ డేటా సెంటర్ విశాఖకు రావడం దేశానికే తలమానికం

విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రావడం దేశానికే తలమానికమని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఎపి బ్రాండ్ పునరుద్ధరణతో 16 నెలల్లో భారీ పెట్టుబడులు సాధించామన్నారు. మంగళవారం ఢిల్లీ నుంచి ఉండవల్లి నివాసానికి చేరుకున్న ఆయనను పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, కార్పొరేషన్ ఛైర్మన్లు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. డేటా సెంటర్ రావడంలో ఐటి మంత్రి నారా లోకేష్ కీలకపాత్ర పోషించారన్నారు. విశాఖను ఐటి హబ్‌గా చేసేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో ఇదో పెద్ద ముందడుగు అని సిఎం పేర్కొన్నారు.

మావోయిస్టు అగ్రనేత మల్లోజుల లొంగుబాటు

- మరో 60 మందితో కలిసి జనజీవన స్రవంతిలోకి ..



ముంబయి : మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యులు మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ సోను మంగళవారం లొంగిపోయారు. ఆయన 60 మందితో కలిసి మహారాష్ట్రలోని గడ్చిరోలి పోలీసుల సమక్షంలో జనజీవన స్రవంతిలో కలిశారు. ఈ విషయాన్ని ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ ధ్రువీకరించారు. ఆయుధాలు వదిలేసి శాంతి చర్చలకు వెళ్లాలని ఈ ఏడాది సెప్టెంబరులో మల్లోజుల ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. దీనికి మావోయిస్టు పార్టీ నార్త్ బస్తర్ డివిజన్ కమిటీ కూడా మద్దతిచ్చింది. అయితే, మల్లోజుల లేఖను హిడ్మా, దేవ్‌జీ వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలోనే కొన్నిరోజుల క్రితం ఆయన మరో లేఖ విడుదల చేశాడు. ఉద్యమం ఓడిపోకుండా కాపాడలేకపోయినందుకు బాధ్యత వహిస్తూ పొలిట్‌బ్యూరో సభ్యునిగా క్షమాపణలు కోరుతున్నానని ఆ లేఖలో పేర్కొన్నారు.

జార్ఖండ్‌లో ఏడాదిలో 32 మంది మావోయిస్టుల కాల్చివేత

రాంచీ : జార్ఖండ్‌లో ఈ ఏడాదిలో సెప్టెంబరు వరకూ భద్రతా బలగాలు, స్థానిక పోలీసులు చేపట్టిన ఆపరేషన్‌లో 32 మంది మావోయిస్టులు చనిపోయారు. 266 మంది మావోయిస్టులను అరెస్టు చేశారు. మరో 30 మంది జనజీవనస్రవంతిలో కలిశారు. ఈ వివరాలను జార్ఖండ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఆపరేషన్స్) ఎస్ మైఖేల్ రాజ్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. పోలీసు కాల్పుల్లో చనిపోయినవారిలో రూ.కోటి రివార్డు ఉన్న సిపిఐ (మావోయిస్టు) సెంట్రల్ కమిటీ సభ్యులు వివేక్ అలియాస్ ప్రయాగ్ మాంఝీ, అనుజ్ అలియాస్ సహదేవ్ సోరెన్ కూడా ఉన్నారు.

పేదలపై భారాన్ని మోపే విద్యుత్ బిల్లును ఉపసంహరించాలి

(మొదటి పేజీ తరువాయి)

మొత్తంగా సరఫరా గొలుసును గుత్త పెట్టుబడిదారులకు అప్పగించేందుకు అమలు చేస్తున్న విస్తృత నయా ఉదారవాద వ్యూహంలో భాగమే ఈ బిల్లు అని తపన్‌సేన్ విమర్శిచారు. ఈ బిల్లును దీన్ని పూర్తిగా ప్రతిఘటించాలని కార్మిక, కర్షకులందరికీ పిలుపునిచ్చారు. ఈ ప్రజా వ్యతిరేక బిల్లును తక్షణమే పూర్తిగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఇతర కార్మిక సంఘాలతో, ప్రజా ఉద్యమాలతో కలిసి దేశవ్యాప్తంగా ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు, సమన్వయ కార్యాచరణ చేపట్టనున్నట్లు తపన్‌సేన్ వెల్లడించారు.

రాజస్తాన్‌లో ఘోరం

(మొదటి పేజీ తరువాయి)

వరకూ కాలిపోయింది. అధిక ఉష్ణోగ్రతలు కారణంగా సహాయక చర్యలకు ఆలస్యమయింది. సాయంత్రం వరకూ మృతదేహాలు బస్సులో ఉన్నాయి. క్షతగాత్రులను జైసల్మేర్‌లోని జవహర్ ఆసుపత్రికి తరలించారు. తరువాత వారిని జోధ్‌పుర్‌కు రిఫర్ చేశారు. గాయలైన వారి పరిస్థితి విషమంగా ఉందని, శరీరంలో 70 శాతం గాయాలయ్యాయని సమాచారం. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ప్రాథమిక విచారణ ప్రకారం షార్ట్ సర్క్యూట్ వలనే ఈ ప్రమాదం జరిగిందని అంచనా వేస్తున్నారు. ఫోరెన్సిక్ బృందం ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేస్తున్నట్లు జోధ్‌పుర్ ఐజీ రాజేశ్ మీనా తెలిపారు. ఈ ఘటనపై రాజస్తాన్ గవర్నర్ హరిభౌ బగడే, ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ స్పందించారు. బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

సమాఖ్య వ్యవస్థలో ఇదేం పద్ధతి

- మీ ఇష్టమొచ్చినప్పుడు దర్యాప్తు చేస్తారా? • ఇక రాష్ట్రాల్లో పోలీసులు దేనికి? • ఇడి తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం



న్యూఢిల్లీ : కేంద్రంలోని ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లో పనిచేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)పై ఇప్పటికే ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్న నేపథ్యంలో దేశ సర్వోన్నత న్యాయస్థానం సైతం పదేపదే చీవాట్లు పెడుతున్న సంగతి విదితమే. కానీ పాలక పెద్దల ఒత్తిళ్లలో ఆ సంస్థ అధికారుల తీరు ఏమాత్రం మారడం లేదు. తమిళనాడు మద్యం కుంభకోణం ఆరోపణలపై దర్యాప్తునకు సంబంధించి విచారణ సందర్భంగా మంగళవారం నాడు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఇడిపై మరోమారు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదే కేసులో తమిళనాడు రాష్ట్ర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఇదే కేసులో దర్యాప్తు పేరుతో ఇడి తమిళనాడులో పదేపదే సోదాలు నిర్వహిస్తూ వస్తోంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసినా..పట్టించుకోవడం లేదు. దీనిపైనే సుప్రీంకోర్టులో విచారణ సాగుతోంది. 'మీకు అనుమానం వచ్చినప్పుడల్లా మీకు మీరు స్వతహాగా దర్యాప్తు చేసేందుకు వెళ్లే అక్కడి పోలీసులకున్న దర్యాప్తు హక్కులు లాగేసుకోవడం కాదా? ఇక సమాఖ్య వ్యవస్థ సంగతేమిటి?' అని విచారణ సందర్భంగా సిజెఐ గవాయ్ ఇడికి తలంటారు. ఈ విషయంలో దర్యాప్తు చేస్తున్న రాష్ట్ర పోలీసుల హక్కులను లాగేసుకోవడం లేదా? అని ప్రశ్నించింది. ఈ కేసుపై రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు చేయడం లేదా? శాంతి భద్రతలను ఎవరు నియంత్రిస్తారు. గత ఆరేళ్లలో ఇడికి సంబంధించి ఎన్నో కేసులు చూశాను. మళ్లీ నేనేం చెప్పదలచుకోలేదు' అని జస్టిస్ గవాయ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

తమిళనాడులో మద్యం రిటైలర్ 'టాస్మాక్'లో అవకతవకలకు సంబంధించి రాష్ట్ర పోలీసులు, అవినీతి నిరోధక శాఖ నమోదు చేసిన కేసుల ఆధారంగా ఇడి మనీలాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలో మార్చిలో ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో సోదాలు జరిపింది. మే నెలలో సంబంధిత అధికారుల ఇళ్లల్లోనూ తనిఖీలు చేసింది. చివరకు ఈ వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరుకుంది. విచారణ చేపట్టిన ధర్మాసనం.. ఇడి అన్ని హద్దులు దాటుతోందని, సమాఖ్య పాలన భావనను ఉల్లంఘిస్తోందని ఆక్షేపించింది. టాస్మాక్‌పై జరుగుతున్న మనీలాండరింగ్ దర్యాప్తుపై స్టే విధించగా.. తాజాగా విచారణ పునఃప్రారంభించింది. ఈ నేపథ్యంలో సిజెఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం మరోసారి ఇడి తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది.

స్టే పొడిగింపు

తమిళనాడు రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ (టిఎఎస్ఎంఎసి)పై ఇడి చేపట్టిన మనీ లాండరింగ్ దర్యాప్తుపై విధించిన స్టేని సుప్రీంకోర్టు మంగళవారం పొడిగించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) కు సంబంధించిన కొన్ని నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన రివ్యూ పిటిషన్లపై సుప్రీం ఉత్తర్వులు ఇచ్చేవరకు ఈ స్టే అమల్లో వుంటుందని ధర్మాసనం పేర్కొంది. కార్పొరేషన్ హెడ్‌క్వార్టర్స్‌పై ఇడి సోదాలు నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చడాన్ని తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం, టిఎఎస్ఎంఎసి సవాలు చేశాయి. కార్పొరేషన్ తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ 2014 నుండి 2021 వరకు అవినీతి ఆరోపణలపై రాష్ట్ర విజిలెన్స శాఖ 47 ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేసిందని, కానీ హఠాత్తుగా 2025లో ఇడి రంగ ప్రవేశం చేసిందని, వెంటనే కార్పొరేషన్ హెడ్‌క్వార్టర్స్‌పై దాడిచేసిందని, అధికారుల ఫోన్లు, వారి ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకుందని చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంలో ఇడి పాత్రను ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం అవినీతిపై దర్యాప్తుచేస్తుంది, ఇడి ఎవరు అవినీతిపై దర్యాప్తు చేయడానికి? అని సిబల్ ప్రశ్నించారు.

పర్వతారోహణలో కర్నూలు యువకుడి రికార్డు

- ప్రపంచంలోని టాప్-9 శిఖరాల అధిరోహణ
- దేశంలోనే తొలి వ్యక్తిగా ఘనత



న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు చెందిన 36 ఏళ్ల పర్వతారోహకుడు తమ్మినేని భరత్ అరుదైన ఘనత సాధించారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 14 శిఖరాల్లో ఒకటైన చైనాలోని మౌంట్ చో ఒయు పర్వతాన్ని (8,188 మీటర్లు) అధిరోహించారు. కాగా ఇప్పటికే ఆయన 8 అత్యంత ఎత్తైన పర్వతాలను విజయవంతంగా అధిరోహించారు. తాజాగా మౌంట్ చో ఒయు పర్వతాన్ని ఎక్కి.. ప్రపంచంలోని ఎత్తైన శిఖరాలలో తొమ్మిదింటిని అధిరోహించిన మొదటి భారతీయునిగా నిలిచారు. భరత్ 2017 మే లో మౌంట్ ఎవరెస్ట్.. సెప్టెంబర్ 2018లో మౌంట్ మనస్లు, మే 2019లో మౌంట్ లోట్సే, మార్చి 2022లో అన్నపూర్ణ, ఏప్రిల్ 2022లో కాంచన్‌జంగా, మే 2023లో మకాలు, అక్టోబర్ 2024లో శిశాపాంగ్మా, ఏప్రిల్ 2025లో మౌంట్ ధౌలగిరి....తదితర 8,000 మీటర్లకు పైగా ఎత్తైన శిఖరాలను అధిరోహించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మౌంట్ చో ఒయు పర్వతాన్ని అధిరోహించడానికి భరత్ సెప్టెంబర్ 30న చైనాలోని చో ఒయు బేస్ క్యాంప్‌కు చేరుకున్నారు. అయితే ఆ సమయంలో అక్కడి ప్రతికూల వాతావరణం, భారీ హిమపాతం కారణంగా పర్వతాన్ని ఎక్కే ప్రయత్నాలు విరమించుకోవాల్సి వచ్చింది. దీంతో నాటి నుంచి అక్కడే ఉన్నారు. మంగళవారం ఉదయం 6.55 గంటలకు ట్రెక్కింగ్ ప్రారంభించి, 8.55 గంటలకు పర్వత శిఖరాన్ని చేరుకున్నట్లు తెలిపారు. దీంతో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 14 శిఖరాల్లో తొమ్మిదింటిని విజయవంతంగా అధిరోహించి..రికార్డు నెలకొల్పారు. ఇక మిగిలిన 5 పర్వతాలు పాకిస్థాన్‌లో ఉన్నందున ప్రస్తుతానికి వాటిని అధిరోహించేందుకు వీలు కుదరడం లేదని, సమీప భవిష్యత్తులోనే ఆ శిఖరాలను కూడా అధిరోహిస్తానని భరత్ తెలిపారు.

భారత్ దగ్గు మందుల పట్ల జాగ్రత్త !

- డబ్ల్యుహెచ్‌ఓ హెచ్చరికలు

న్యూఢిల్లీ : భారత్‌లో గుర్తించబడిన మూడు కలుషితమైన దగ్గు మందుల పట్ల జాగ్రత్తగా వుండాలంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) హెచ్చరికలు జారీచేసింది. వారి వారి దేశాల్లో ఈ మందులు కనిపించిన పక్షంలో తక్షణమే వాటి గురించి తమకు తెలియచేయాల్సిందిగా ప్రపంచవ్యాప్తంగా గల ఆరోగ్య శాఖ అధికారులను కోరింది.

వీటిని కోల్డ్‌రిఫ్, రెస్పిఫ్రెష్ టిఆర్, రీలైఫ్‌లకు చెందిన నిర్దిష్ట బ్యాచ్‌లుగా గుర్తించారు. వీటిని వరుసగా శ్రీసన్ ఫార్మాస్యూటికల్, రెడ్‌నెక్స్ ఫార్మాస్యూటికల్, షేప్ ఫార్మాలు తయారు చేశాయని డబ్ల్యుహెచ్‌ఓ జారీ చేసిన ప్రకటన పేర్కొంది. కలుషితమైన ఈ దగ్గు సిరప్‌ల వల్ల రోగులకు తీవ్రమైన ముప్పులు పొంచి వున్నాయని, ఒకోసారి ప్రాణాపాయం కూడా కలిగే ప్రమాదముందని డబ్ల్యుహెచ్‌ఓ పేర్కొంది. ఈ నాసిరకం ఉత్పత్తులు ఎక్కడన్నా కనబడితే లేదా వీటిని వాడడం వల్ల ఏదైనా ప్రతికూల సంఘటనలు చోటు చేసుకుంటే వెంటనే ఆ సమాచారాన్ని జాతీయ రెగ్యులేటరీ అధికారులకు లేదా జాతీయ ఫార్మాకోవిజిలెన్స్ సెంటర్‌కు తెలియచేయాలని డబ్ల్యుహెచ్‌ఓ కోరింది. కోల్డ్‌రిఫ్ తయారీదారైన శ్రీసన్ ఫార్మాస్యూటికల్ కంపెనీ తయారీ లైసెన్స్‌ను సోమవారం తమిళనాడు ప్రభుత్వం రద్దు చేసింది. వెంటనేకంపెనీని మూసివేయాల్సిందిగా ఆదేశించింది. విషపూరితమైన పారిశ్రామిక రసాయనం డైథలిన్ గ్లైకాల్ 45 శాతానికి పైగా ఆ సిరప్‌లో వున్నట్లు తేలింది. ఈ సిరప్ తాగి మధ్యప్రదేశ్‌లో 24 మంది, రాజస్థాన్‌లో ముగ్గురు మరణించారు.

హర్యానాలో ఆగని ఖాకీ ఆత్మహత్యలు

- తాజాగా మరో అధికారి సూసైడ్


సందీప్‌కుమార్

చండీఘర్ : సీనియర్ ఐపిఎస్ అధికారి వై.పూరణ్ కుమార్ ఆత్మహత్య ఉదంతంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో హర్యానాలో మరో అధికారి తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడంతో చర్చనీయాంశంగా మమారింది. పూరణ్‌ను లక్ష్యంగా చేసుకుని ఆ అధికారి తన సూసైడ్ నోట్‌లో ఆరోపణలు చేసినట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. ఏఎస్పై సందీప్‌కుమార్ రోహ్‌తక్ సైబర్ సెల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. పూరణ్ కుమార్‌పై ఉన్న ఓ అవినీతి కేసును ఆయన దర్యాప్తు చేస్తున్నారు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ పూరన్ కుమార్‌పై తన సూసైడ్ నోట్‌లో ఆరోపణలు చేశారు. నిజాలు వెలుగులోకి రావడం కోసం తన జీవితాన్ని త్యాగం చేస్తున్నట్టు రాశారు.

సెలవుపై డిజిపి..

బిజెపి ప్రభుత్వం సోమవారం రాత్రి రాష్ట్ర డిజిపి శత్రుజిత్ కపూర్‌ను సెలవుపై పంపింది. కపూర్ సెలవు కాలంలో 1992 ఐపిఎస్ బ్యాచ్ అధికారి ప్రకాష్ సింగ్‌కు డిజిపిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆత్మహత్య చేసుకున్న పూరణ్ కుమార్ కుటుంబ సభ్యులను కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మంగళవారం పరామర్శించారు. రాహుల్ రాక నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించి డిజిపిని సెలవుపై పంపింది. ఇదిలావుండగా రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన సందర్భంగా సోనిపట్‌లో ఈ నెల 17న పార్టీ భారీ ర్యాలీని తలపెట్టింది. ఈ ర్యాలీని ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగించాల్సి ఉంది. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో ర్యాలీని రద్దు చేశారు. పూరణ్ కుమార్ ఆత్మహత్య ఉదంతం తర్వాత రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు ప్రధాని పర్యటనకు అనువుగా లేవని బిజెపి భావించింది. కుల వివక్ష, సీనియర్ అధికారుల వేధింపుల కారణంగా ఈ నెల 7వ తేదీన పూరణ్ కపూర్ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే.

స్తంభించిన బెల్జియం

ఉధృతంగా కార్మికుల జాతీయ సార్వత్రిక సమ్మె

బ్రస్సెల్స్ : బెల్జియంలో కార్మికులు మంగళవారం నిర్వహించిన జాతీయ సమ్మెతో దేశం స్తంభించిపోయింది. దేశంలో రవాణా, ప్రభుత్వ కార్యకలాపాలు నిలిచిపోయాయి. విమానాశ్రయాలను మూసేసారు. యూరప్‌లో రెండో అతిపెద్ద ఓడరేవు ఆంట్వెర్ప్‌లో షిప్పింగ్ ఆగిపోయింది. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఎఫ్‌జిటిబి, ఎసివి, సిఎస్‌సి, ఎబివివి కార్మిక సంఘాలు ఈ జాతీయ సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయి.. రాజధాని బ్రస్సెల్స్‌లో లక్షకు పైగా కార్మికులు భారీ ప్రదర్శనను నిర్వహించారు. మన హక్కుల కోసం..మన పోరాటం అని నినదించారు. ఈ ర్యాలీని సెంట్రల్ స్టేషన్ వద్ద పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రికత్తంగా మారింది. పోలీసులు వాటర్ ఫిరంగులు, టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. దీంతో అనేక మంది కార్మికులు గాయపడ్డారు. ప్రధానమంత్రి కార్యాలయాన్ని ముట్టడించేందుకు కార్మికులు ప్రయత్నించడంతో అనేక మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సమ్మెలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, జైళ్ల సిబ్బంది, పోస్టల్ కార్మికులు, నౌకా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమ్మె ఎందుకు ?

బెల్జియంలో ప్రధాన మంత్రి బార్ట్ డి వేవర్ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఎన్నికల ప్రచారంలో ప్రజలపై భారాలు తగ్గిస్తానని ప్రచారం చేసిన డి వేవర్ ప్రధాని అయిన మాత్రం సంక్షేమానికి కోతలు పెడుతున్నారు. కార్మికుల పెన్షన్‌లను తగ్గించే సంస్కరణలను తీసుకువచ్చారు. సమ్మెకు నాయకత్వం వహిస్తున్న యూనియన్లలో ఒకటైన ఎఫ్‌జిటిబి కార్మిక నాయకుడు థీయరీ బోడ్సన్ మీడియాతో మాట్లాడుతూ ప్రధాని డి వేవర్ కార్మిక వ్యతిరేక విదానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. పెన్షన్‌ల వయోపరిమితిని 67 ఏళ్లకు పెంచడం, పెన్షన్ పొందేందుకు అదనపు రోజులు పని చేయాలని ప్రతిపాదించడం అన్యాయమన్నారు. బడ్జెట్ లోటు పేరుతో కార్మికుల సంక్షేమానికి కోతలు పెట్టడం సరికాదన్నారు. ప్రభుత్వం దిగిరాకపోతే మరిన్ని సమ్మెలు తప్పవని హెచ్చరించారు. ఈ సమ్మెలో సోషలిస్టు ఎంపి మార్టిన్ కాసియర్ పాల్గొని మద్దతు తెలిపారు. కార్మికులు సామాజిక వ్యతిరేక, మితవాద చర్యల ఉపద్రవాన్ని ఎదుర్కోంటున్నారని, ప్రభుత్వం ఎల్లప్పుడూ కార్మికులనే టార్గెట్ చేస్తుందని విమర్శించారు.

కార్పొరేట్ల గుప్పెట్లో పచ్చని భూములు

(మొదటి పేజీ తరువాయి)

రెండు వేల ఎకరాల్లో పట్టాలు ఉన్న వంద మంది రైతులకు చెందిన 500 ఎకరాలకు మాత్రమే ఎకరాకు రూ.8 లక్షల నుంచి రూ.11 లక్షల వరకూ పరిహారాన్ని అందించారు. ఏళ్ల కాలంగా మరో 300 మంది రైతులు 1500 ఎకరాలు సాగు చేసుకుంటున్నా పరిహారం ఇవ్వలేదు. 2022 సెప్టెంబర్‌లో నంద్యాల జిల్లా కొలిమిగుండ్లలో రామ్‌కో పరిశ్రమను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభించినప్పుడు దాదాపు వెయ్యి మందికి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. ప్రస్తుతం ఆ సంఖ్యలో ఉద్యోగులు ఉన్నా, వారిలో స్థానికులు 300 మందే. కర్నూలు అల్ట్రా మెగా సోలార్ పార్క్‌కు భూములు ఇచ్చిన రైతుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. మొత్తం 1800 రైతు కుటుంబాలు ఉండగా, 25 మంది ఐటిఐ వారికి, పది మంది డ్రైవర్లకు మాత్రమే అందులో ఉద్యోగాలు కల్పించారు. తాజాగా పత్తికొండ మండలం హోసూరు, పెద్దహుల్తి గ్రామాల్లో సోలార్ విద్యుదుత్పత్తి కోసం టాటా పవర్ కంపెనీ రైతుల నుంచి 1800 ఎకరాలను సేకరిస్తోంది. ఆ ప్రాంతంలో రైతులు వేరుశనగ, ఉల్లి, వాము, జొన్న, కొత్తిమీర తదితర పంటలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మధ్య దళారులు రైతులను మభ్యపెట్టి పంట భూములను కారు చౌకగా ప్రయివేట్ కంపెనీలకు దోచిపెడుతున్నారు. ఇప్పటికే రైతుల నుండి దాదాపు వెయ్యి ఎకరాలకు లీజు ఒప్పందం జరిగినట్లు సమాచారం. ఆలూరు, హోళగుంద, ఆస్పరి, చిప్పగిరి మండలాల్లో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సాయిరాం, పెంటాగాన్, దత్తు, టిజివి గ్రూప్ కంపెనీలు కలిసి ఐదు వేల ఎకరాలను రైతుల నుంచి సేకరిస్తున్నాయి. వాటికి తోడు ఓర్వకల్లు మండలం మీదివేముల, కొమరోలు, పాలకొలను, గుట్టపాడు, పూడిచర్ల గ్రామాల్లో 15 వేల ఎకరాలను రైతుల నుంచి లాక్కొని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ఎపిఐఐసి సిద్ధం అవుతోంది.

ఆలూరులో రైతుల నుంచి వ్యతిరేకత

ఆలూరు నియోజకవర్గంలో మనేకుర్తి, హులేబీడు, కమ్మరచేడు గ్రామాల రెవెన్యూ పరిధిలో సోలార్ కోసం 192 ఎకరాల సాగు భూమిని రాష్ట్ర ప్రభుత్వం చేసేందుకు సమాయత్తం అవుతోంది. మనేకుర్తికి చెందిన రైతుల నుండి 94.64 ఎకరాలు, హులేబీడు గ్రామానికి చెందిన 82.11 ఎకరాలు, కమ్మరచేడు గ్రామానికి చెందిన 15.016 ఎకరాలు భూసేకరించాలని నిర్ణయించింది. మొత్తం 74 మంది రైతుల నుంచి భూమి తీసుకోవాలని అనుకోగా 60 మంది రైతులు భూములు ఇవ్వబోమని తేల్చి చెబుతున్నారు. ఆలూరు మండలం మనేకుర్తిలో సోలార్ గ్రిడ్ కోసం సేకరించే భూమికి తొలుత ఎకరాకు రూ.6 లక్షల పరిహారం ఇస్తామన్నారు. తర్వాత దాన్ని రూ.12 లక్షలకు పెంచారు. తాజాగా రూ.18 లక్షలు ఇస్తామని అంటున్నారు. అయినా, సరే మా భూములు ఇస్తే తమకు ఆధారం లేకుండా పోతుందని, భూములను ఇచ్చేదే లేదని రైతులు తేల్చి చెబుతున్నారు.



మీ కోసం
నల్ల జీలకర్రను వస్త్రంలో చుట్టి నలుపుతూ వాసన చూస్తూ ఉంటే ముక్కు దిబ్బడ తగ్గుతుంది.


జీవన సౌరభం
అజ్ఞానాన్ని తెలుసుకోవడమే నిజమైన జ్ఞానం.

వాటర్ బాటిల్

అద్విక్, కృతిన్ తొమ్మిదవ తరగతి చదువుతున్నారు. ఒకరోజు వారిద్దరూ బడికి వెళ్తూ ఒక షాపు దగ్గర ఆగారు. అక్కడ ఒక యువకుడు వాటర్ బాటిల్‌లో నీరు తాగుతున్నాడు. నీళ్లన్నీ అయిపోయాక బాటిల్‌ని బాగా నలిపి కింద పడేశాడు.

పిల్లలిద్దరూ అది చూసి, దాన్ని తియ్యబోయారు. అప్పుడు ఆ యువకుడు 'సారీ తమ్ముళ్లు.. మీరు తీయకండి. నేనే తీసి చెత్తబుట్టలో వేస్తాను. సరేనా' అన్నాడు.

'అలాగే.. అయితే నువ్వు ఆ బాటిల్ పడేసేముందు దాని మూత బాగా నలిపి అందులో వెయ్యి. ఎందుకంటే ఈ మధ్య కింద పడిన ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను మళ్లీ ఉపయోగిస్తున్నట్లు మా మాస్టార్లు చెప్పారు. అలా చేయడం చాలా హానికరం. నువ్వు నలిపిన బాటిల్ తీసుకొని ఊదితే మామూలుగా వస్తుంది. అదే అందులో ఆ బాటిల్ మూత గట్టిగా నలిపి లోపల వేస్తే అది తీయడం చాలా కష్టం, అప్పుడు ఆ బాటిల్‌ని మరలా ఎవరూ ఉపయోగించరు' అని పిల్లలిద్దరూ చెప్పారు. పిల్లల మాటలు విన్న ఆ యువకుడు అలాగే చేశాడు. ఈ సంభాషణ




అంతా విన్న షాపు దగ్గర వ్యక్తులు అద్విక్, కృతిన్ని మెచ్చుకున్నారు.

– ఒట్ర ప్రకాష్ రావు, తిరుపతి.
97874 46026.

సమాధానాలు రాయండి

పిల్లలూ, బొమ్మ నెంబరుకు సరిపోయే గడిలో దాని సరైన పదం రాయండి.. తమాషాగా 10వ నంబరులో ఉన్న బొమ్మ పేరు కూడా వచ్చేస్తుంది.



నేను గీసిన బొమ్మ



ఎ.గౌతమ్ కుమార్
2వ తరగతి,
ఎం.పి.పి.ఎస్;
టి బెంపులే,
విస్సన్నపేట, ఎన్టీఆర్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పరిశుభ్రతతో వ్యాధులు మటుమాయం


చేతులు కడుక్కోవడం అనేదాన్ని ఒక అలవాటుగా మార్చుకోవాలి. ముఖ్యంగా భోజనానికి ముందు చేతులు కడుక్కోవడం మర్చిపోకూడదు. తినడానికి ముందు, తిన్న తర్వాత చేతులు సరిగ్గా కడుక్కోకపోతే కొన్ని రకాల వ్యాధికారక క్రిములు మన శరీరంలోకి ప్రవేశిస్తాయి. ఇవి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి. ముఖ్యంగా సాల్మోనెల్లా ఈ–కోలై, నోరోవైరస్ వంటి బ్యాక్టీరియా, వైరస్‌లు చేతుల ద్వారా సులభంగా వ్యాపిస్తాయి. ఇవి ఆహారం ద్వారా కడుపులోకి చేరి వాంతులు, విరేచనాలు, జ్వరం, కడుపు నొప్పి వంటి లక్షణాలను కల్గిస్తాయి. హెపటైటిస్ ఎ వంటి వైరస్‌లు కూడా కలుషితమైన చేతుల ద్వారా వ్యాప్తి చెంది కాలేయ సమస్యలకు దారితీస్తాయి. కేవలం బ్యాక్టీరియా, వైరస్‌లే కాకుండా కొన్ని రకాల పరాన్నజీవులు కూడా శరీరంలోకి ప్రవేశిస్తాయి. మలంలోని సూక్ష్మక్రిములు, లేదా మట్టిలో ఉండే కొన్ని రకాల పరాన్నజీవుల గుడ్లు చేతులకు అంటుకొని, వాటిని శుభ్రం చేసుకోకుండా ఆహారం తీసుకున్నప్పుడు శరీరంలోకి వెళ్తాయి. ఇది దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. ముఖ్యంగా పిల్లల్లో ఈ సమస్యలు ఎక్కువగా కన్పిస్తాయి. తరచుగా చేతులు శుభ్రం చేసుకోకపోవడం వల్ల రోగనిరోధక శక్తి కూడా బలహీనపడుతుంది, దీనివల్ల ఇతర ఇన్ఫెక్షన్లు కూడా సులభంగా సోకే అవకాశం ఉంటుంది. ఈ క్రిములు శరీరంలోకి ప్రవేశించకుండా అడ్డుకోవడానికి సబ్బు, నీటితో కనీసం 20 సెకన్ల పాటు చేతులు శుభ్రంగా కడుక్కోవడం అత్యంత ప్రభావవంతమైన పద్ధతి. గోర్లు, వేళ్ల మధ్య, చేతి వెనుక భాగాలను శుభ్రంగా రుద్ది కడగాలి. సబ్బు అందుబాటులో లేనప్పుడు, కనీసం శానిటైజర్ ఉపయోగించొచ్చు. టాయిలెట్ వాడిన తర్వాత, ముక్కు చీదినప్పుడు, తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు, పెంపుడు జంతువులను తాకిన తర్వాత, గాయాలను శుభ్రం చేసిన తర్వాత, చెత్తను పారవేసిన తర్వాత, ఆహారం తయారు చేయడానికి ముందు, తిన్న తర్వాత తప్పనిసరిగా చేతులు కడుక్కోవాలి. చేతులు శుభ్రం చేసుకోకపోవడం వల్ల కలిగే నష్టాలు చాలా ఉన్నాయి. ఇది సాధారణ జలుబు నుండి తీవ్రమైన డయేరియా వంటి అంటు వ్యాధుల వరకు దారితీస్తుంది. వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం వల్ల పాఠశాలలు, కార్యాలయాలు, ఆసుపత్రులు వంటి సమూహ ప్రదేశాల్లో వ్యాధులు వేగంగా వ్యాపిస్తాయి. ఇది అనారోగ్యంతో పాటు వైద్య ఖర్చులకు, పని కోల్పోవడానికి కూడా దారితీస్తుంది. ప్రతి ఒక్కరూ చేతులు శుభ్రంగా కడుక్కోవడం అలవాటు చేసుకోవడం ద్వారా తమ ఆరోగ్యాన్ని, ఇతరుల ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చు.

ఆరోగ్యం, వ్యాధి నివారణలో కీలకమైన భాగమైన చేతులను శుభ్రంగా కడుక్కుంటే వ్యాధులు దరిచేరవు. చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవడం వల్ల బాక్టీరియా, వైరస్‌లు, ఇతర హానికర జీవులను తొలిగిపోయి అనేక అంటువ్యాధుల నుండి బయటపడతాం. ముఖ్యంగా కోవిడ్–19 మహమ్మారి కాలంలో చేతులను ఎక్కువగా శుభ్రం చేసుకున్నాం. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సబ్బులు, పేస్టులు, మందులతోపాటు మరికొన్ని ఆరోగ్య పరమైన అంశాల గురించి టీవీల్లో ప్రకటనలు వస్తూనే ఉంటాయి. అన్నీ వింటూనే ఉంటారు. కానీ పరిశుభ్రత విషయంలో మాత్రం పిల్లల నుంచి పెద్దల వరకూ అశ్రద్ధ వహిస్తూనే ఉంటారు. ఆనక అనారోగ్యం పాలవుతుంటారు. ఏదైనా ఆహార పదార్థాలు తినే ముందు చేతులు కడుక్కుంటే మంచిది. కొందరు ఏముంటుందిలే అనే భావనతో తిన్నాక ఎలాగు కడుక్కుంటాం కదా? అంటూ లాగించేస్తుంటారు. కొందరు ఆత్మీయతతో షేక్ హ్యాండ్ ఇస్తుంటారు. అలాంటప్పుడు కూడా చేతులను కడుక్కోవాల్సిందే. అలాకాకుండా ఏముంటుందిలే అని భావించి తినేస్తే వారి చేతుల ద్వారా మన చేతులకు వచ్చిన వైరస్‌లు శరీరంలోకి ప్రవేశించి అనారోగ్యానికి గురవుతారు. అదే చేతులు కడుక్కుంటే ఏమైనా వైరస్‌లు అంటి వుంటే తొలగిపోతాయి.



-డాక్టర్ కాకొల్లు సుధ
డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం
డైరెక్టర్, విజయవాడ

ఎక్కువ వ్యాధులు మన చేతుల నుంచి వైరస్, బ్యాక్టీరియాల ద్వారానే వ్యాప్తి చెందుతున్నాయి. ఏటేటా ప్రపంచవ్యాప్తంగా 35 లక్షల మంది చిన్న పిల్లలు డయేరియా, నిమోనియా వంటి వ్యాధులతో చనిపోతున్నారు. చేతులు కడుక్కోవడం వల్ల డయేరియా వచ్చే అవకాశాలు 30 శాతం, శ్వాసకోశ వ్యాధులు 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల్లో 21 శాతం తగ్గుతాయని పరిశోధనల్లో వెల్లడైంది. అంతర్జాతీయ అధ్యయనం ప్రకారం భారతదేశంలో 44 శాతం మంది మాత్రమే భోజనానికి ముందు చేతులు కడుక్కుంటున్నారని వెల్లడైంది.



నేడు ప్రపంచ చేతుల పరిశుభ్రతా దినోత్సవం

చేతులను శుభ్రంగా కడుక్కోవటం ద్వారా ఒనకూరే ప్రయోజనాలు...

డయేరియా నుంచి విముక్తి : కడుపులో రోగ క్రిములు ఆవాసం ఏర్పర్చుకోవడానికి అతి ముఖ్యమైన కారణం చేతులను అపరిశుభ్రంగా ఉంచుకోవడం. దీనివల్ల వీరోచనాలు, (అతిసార) డయేరియా వచ్చేందుకు ఆస్కారముంటుంది. పరిశోధనల ప్రకారం చేతులు కడుక్కోవడం వల్ల అతిసారం వచ్చే అవకాశం 23 నుంచి 4 శాతం తగ్గుతుంది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే వ్యక్తుల్లో కూడా చేతులు పరిశుభ్ర పరుచుకోవడం ద్వారా డయేరియా రావడం 58 శాతం తగ్గిస్తుంది.

శ్వాసకోశ వ్యాధుల తీవ్రత తగ్గుదల : సైనస్, ఇతర శ్వాస సంబంధిత వ్యాధులతో బాధపడేవారు చేతులు కడుక్కోలేకపోతే అనారోగ్యం పాలవుతున్నారు. తరచూ జలుబు, ముక్కు నుంచి తుమ్ములు, నీరు కారటం, చీమిడి రావటం వంటి సమస్యలతో బాధపడుతుంటే ఇంకా తీవ్రమవుతాయి. చేతులను శుభ్రం చేసుకుంటే ఆ సమస్యలు దరిచేరవు. చేతులు పరిశుభ్రంగా ఉంచుకునే వారిలో జలుబు, న్యుమోనియా వంటి శ్వాసకోశ వ్యాధులు 16 నుండి 21 శాతం తగ్గినట్లుగా నివేదికలు చెబుతున్నాయి.



పిల్లల్లో చురుకుదనం : అనారోగ్యం, నీరసంగా ఉండటం వల్ల చాలా మంది పిల్లలు జబ్బు పడి కొన్ని రోజులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లకుండా ఆగిపోతుంటారు. సాధారణంగా పరిశీలిస్తే అపరిశుభ్ర అలవాట్ల ద్వారానే వీరు అనారోగ్యానికి గురౌతున్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత వంటి అలవాట్లు పాటించటం వారికి నేర్పించారు. పరిశుభ్రమైన అలవాట్లు కలిగిన పిల్లల్లో తరగతుల గైర్హాజరును 29–57 శాతం తగ్గిస్తుంది.

కంటి ఇన్ఫెక్షన్ల నియంత్రణ : కండ్లకలక వంటి వ్యాధులు అపరిశుభ్రమైన చేతులతో కళ్ళ వద్ద నిరంతరం రుద్దడం ద్వారా వస్తుంది. ఈ కంటి సమస్య వచ్చిన వారి నుండి ఇతరులకు వ్యాపిస్తుంది.

అంటువ్యాధుల తగ్గుదల : చేతులు, పాదాలు, నోటి వ్యాధి, గజ్జి, తామెర వంటి చర్మ వ్యాధులు ఒకరి నుంచి ఒకరిని తాకడం ద్వారా వ్యాపిస్తాయి. శుభ్రమైన చేతులు అంటువ్యాధుల అవకాశాలను తగ్గిస్తాయి. చేతులను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా, శరీరంలో ఉండే వ్యాధినిరోధక శక్తిపై భారం తగ్గుతుంది. సరిగ్గా కడిగిన చేతులు ఎన్నోరకాల అంటువ్యాధులు, కడుపునొప్పి అవకాశాలను తగ్గిస్తాయి తద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుంది.



వెంకట్ ప్రభు దర్శకత్వంలో

శివకార్తికేయన్, వెంకట్ ప్రభు దర్శకత్వంలో ఓ సినిమా రాబోతోంది. ఈ ప్రాజెక్టుపై దర్శకుడు వెంకట్ ప్రభు మాట్లాడుతూ, 'శివకార్తికేయన్ కథానాయకుడిగా తాను దర్శకత్వం వహించే చిత్రం ప్రీ ప్రొడక్షన్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. వచ్చే యేడాది జనవరిలో చిత్రీకరణ ప్రారంభమతుంది. ఇది వైవిధ్యభరితమైన సైన్స్ ఫిక్షన్ మూవీ. ఇందులో హీరోను సరికొత్త లుక్‌లో చూస్తారు. ఈ ప్రాజెక్టులో నటించే ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు, నిర్మాణ సంస్థ, సంగీత దర్శకుడు తదితర వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం' అని పేర్కొన్నారు.

మౌళికి మరో సినిమా ఛాన్స్



'లిటిల్ హార్ట్స్' సినిమాతో నటుడు మౌళి భారీ క్రేజ్ తెచ్చుకున్నాడు. గతేడాదిలో 'హ్యాష్‌ట్యాగ్ 90' అనే వెబ్ సిరీస్‌తో యూత్‌కు బాగా దగ్గరయ్యాడు. తన టైమింగ్ డైలాగ్స్‌తో గుర్తింపు సంపాదించాడు. కథానాయకుడిగా తొలి సినిమా 'లిటిల్‌హార్ట్స్'తో బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్నాడు. ఇప్పుడు పెద్ద నిర్మాతలు కూడా తనతో ఒక సినిమా చేద్దాం అనుకునే రేంజ్‌కు చేరుకున్నాడు. కొత్త దర్శకులు కూడా ఇప్పటికే స్టోరీ చెప్పేందుకు రెడీ అవుతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నుంచి ఇప్పటికే సినిమా ఆఫర్ వచ్చింది. రూ.కోటి పారితోషికం ఇచ్చేందుకు కూడా ఆ సంస్థ సిద్ధమైనట్లుగా సమాచారం.

సిగ్గుతో తలదించుకోవాలి..

అఫ్ఘానిస్తాన్ విదేశాంగ మంత్రి, సీనియర్ తాలిబాన్ నాయకుడు అమీర్ ఖాన్ ముత్తకీ భారత పర్యటన సందర్భంగా ఆయనకు లభించిన ఆదరణపై బాలీవుడ్ గేయరచయిత జావెద్ అఖ్తర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆయన.. ప్రపంచంలోనే అత్యంత దారుణమైన ఉగ్రవాద సంస్థగా పేరొందిన తాలిబాన్ ప్రతినిధికి ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తామని ఉపన్యాసాలు ఇచ్చే బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న గౌరవం, స్వాగతం చూస్తుంటే సిగ్గుతో తన తల వాలిపోతుందని జావెద్ తెలిపారు. అలాగే ఉత్తరప్రదేశ్‌లోని దారుల్ ఉలూమ్ దియోబంద్ ఇస్లామిక్ సెమినరీలో



ముత్తకీకి అందించిన గౌరవప్రదమైన స్వాగతంపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అమ్మాయిల విద్యను పూర్తిగా నిషేధించిన వ్యక్తులలో ఒకరైన తమ ఇస్లామిక్ హీరోకు ఇంతటి గౌరవం ఇచ్చిన దియోబంద్‌కు కూడా సిగ్గుండాలి అని ఆయన విమర్శించారు. చివరగా, 'నా భారతీయ సోదరీ సోదరులారా! మన దేశంలో ఏం జరుగుతోంది? అంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

యూనిక్ కథతో 'మేఘన' : చిత్రం శ్రీను

'మంచి కంటెంట్‌తో వస్తున్న 'మేఘన' సినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. నా ఖాతాలో మరో హిట్ పడుతుందని ఖచ్చితంగా చెప్పగలను. నాకు అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు ధన్యవాదాలు' అని కథానాయకుడు చిత్రం శ్రీను అన్నారు. 'చిత్రం' శ్రీను, సుష్మ, రామ్ బండారు ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'మేఘన'. సుధాకర రెడ్డి వర్ర దర్శకత్వం వహించారు. శ్రీ శివ సాయి ఫిలిమ్స్ బ్యానర్‌పై నంది వెంకట్‌రెడ్డి నిర్మించారు. ఈ చిత్ర పోస్టర్, టీజర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లోని ఫిల్మ్ ఛాంబర్‌లో జరిగింది. 'సమాజానికి మంచి సందేశం ఇచ్చేలా, ఫ్యామిలీ ఆడియెన్స్‌కి నచ్చేలా సినిమాని తీర్చిదిద్దాం. అన్ని వర్గాల ప్రేక్షకులను



ఆకట్టుకునే విధంగా కథ సాగుతుంది. త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తాం. ఓ మంచి కథతో సినిమా తీసినందుకు సంతోషంగా ఉంది' అని నిర్మాత నంది వెంకట్‌రెడ్డి అన్నారు. చిత్ర యూనిట్ ప్రతినిధులంతా పాల్గొన్నారు.

శ్రీలీల 'ఏజెంట్ మిర్చి'



టాలీవుడ్ కథానాయిక శ్రీలీల 'ఏజెంట్ మిర్చి' పేరుతో సరికొత్త గెటప్‌లో ప్రేక్షకులను అలరించబోతున్నారు. ఆమె నటించిన 'రాబిన్‌హుడ్', 'జూనియర్' సినిమాలు ఈ ఏడాది విడుదలైన విషయం తెలిసిందే. ఈనెల 31న విడుదలకానున్న 'మాస్ జాతర'లోనూ ఆమె నటించారు. ఇవే కాకుండా తెలుగు, తమిళ, హిందీలోనూ మరికొన్ని చిత్రాల్లో నటిస్తున్నారు. తాజాగా తన ఇన్‌స్టాలో కొత్తగా 'ఏజెంట్ మిర్చి' పేరుతో పెట్టిన పోస్టర్ ఆసక్తిగా మారింది. ఈనెల 19న పూర్తి వివరాలు వెల్లడిస్తామని అందులో రాసివుంది. ఇది హిందీ ప్రాజెక్టా? లేక వెబ్‌సిరీసా? అనేది ఇంకా స్పష్టత రాలేదు. పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్, శివకార్తికేయన్ 'పరాశక్తి', కార్తిక్ ఆర్యన్‌తో సినిమాలు చేస్తున్నారు.

గుండెపోటుతో కమెడియన్ మృతి



కన్నడ కమెడియన్, బిగ్‌బాస్–7 కంటెస్టెంట్ రాజు తాలికొటే మరణించారు. సోమవారం అర్ధరాత్రి గుండెపోటుకు గురైన ఆయన్ను కర్ణాటకలోని ఉడుపి మణిపాల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మనసారె, పంచరంగి, లైఫ్ ఈజ్ దట్, రాజ్‌ధాని, మైనా, టోపీవాలా వంటి చిత్రాల్లో ఆయన నటించారు. బిబి–7లో పాల్గొనడంతో పాటు పలు టీవీ సీరియళ్లలోనూ సందడి చేశారు. రాజు మతి పట్ల కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ సంతాపం తెలిపారు.

టీమిండియా క్లీన్‌స్వీప్

రెండో టెస్ట్‌లో వెస్టిండీస్‌పై ఏడు వికెట్ల తేడాతో గెలుపు
సిరీస్ 2–0తో కైవసం



టెస్ట్ సిరీస్ ట్రోఫీతో టీమిండియా ఆటగాళ్లు

న్యూఢిల్లీ: ఆసియాకప్ టైటిల్ నెగ్గిన టీమిండియా ఖాళీ చేతులతోనే తిరిగొచ్చింది. ఆ కప్ ఇప్పటివరకు టీమిండియా చేతికి అందలేదు. కానీ భారత్ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను నెగ్గి అభిమానులను సంబరాల్లో ముంచెత్తింది. అరుణ్ జైట్లీ స్టేడియంలో వెస్టిండీస్ జట్టు నిర్దేశించిన 121 పరుగుల లక్ష్యాన్ని టీమిండియా కేవలం మూడు వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌ను 2–0 తేడాతో సొంతం చేసుకుంది. ఓవర్‌నైట్ స్కోర్ వికెట్ నష్టానికి 51పరుగులతో ఐదో, చివరిరోజు ఆటను కొనసాగించిన భారత ఓపెనర్ కేఎల్ రాహుల్(58నాటౌట్), జురెల్(6నాటౌట్) మ్యాచ్‌ను ముగించారు. టెస్టుల్లో రాహుల్‌కు ఇది 21వ అర్థ సెంచరీ. 102 బంతుల్లో అతను హాఫ్ సెంచరీ కొట్టాడు. సాయి సుదర్శన్(39), శుభ్‌మన్(13) ఔటయ్యారు. ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 518 పరుగులకు ఇన్నింగ్స్ డిక్లేర్ చేయగా.. వెస్టిండీస్ తన తొలి ఇన్నింగ్స్‌లో 248 పరుగులు చేసి ఫాలోఆన్ ఆడింది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో విండీస్ బ్యాటర్ల కాస్త మెరుగ్గా ఆడాడు. క్యాంప్‌బెల్, హోప్‌లు సెంచరీలతో ఆకట్టుకున్నారు. ఆ తర్వాత లోయర్ ఆర్డర్‌లోనూ విండీస్ బ్యాటర్లు కీలక రన్స్ సాధించారు. దీంతో విండీస్ 120 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. ఈ విక్టరీతో భారత్‌కు వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ పాయింట్ల టేబుల్‌లో 61.9 శాతం పాయింట్లు జతకలిశాయి.

మూడో స్థానంలోనే టీమిండియా..

2025–27 ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యుటిసి)లో భారతజట్టు విజయాల శాతాన్ని 61.90 పాయింట్లకు పెంచుకుంది. వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్‌కు ముందు ఆ శాతం 43.56 శాతంగా ఉండేది. ఈ సిరీస్‌ను టీమిండియా క్లీన్‌స్వీప్ చేయడంతో మరో 18.34 శాతం పాయింట్లు జమ అయ్యాయి. దీంతో భారత్ పాయింట్ల శాతాన్ని భారీగా పెంచుకున్నా, పట్టికలో మాత్రం మూడో స్థానంలోనే ఉంది. 2025–27 డబ్ల్యుటిసి సైకిల్‌లో భారత్ 7 మ్యాచ్‌ల్లో 4 విజయాలు, 2 పరాజయాలు, ఓ డ్రాతో 52 పాయింట్లు సాధించింది. ఆస్ట్రేలియా, శ్రీలంక టాప్–2లో కొనసాగుతున్నాయి. ఆస్ట్రేలియా 3 మ్యాచ్‌ల్లో 3 విజయాలతో 100 శాతం పాయింట్లు సాధించగా.. శ్రీలంక 2 మ్యాచ్‌ల్లో ఓ విజయం, ఓ డ్రాతో 66.67 పాయింట్ల శాతాన్ని కలిగి ఉంది. జాబితాలో ఆస్ట్రేలియా, శ్రీలంక, భారత్ తర్వాతి స్థానాల్లో ఇంగ్లండ్ (43.33), బంగ్లాదేశ్ (16.67), వెస్టిండీస్, న్యూజిలాండ్, పాకిస్తాన్, సౌతాఫ్రికా ఉన్నాయి. కాగా, ప్రస్తుత డబ్ల్యూటీసీ సైకిల్‌లో టీమిండియా తదుపరి టాస్క్ నవంబర్‌లో ఎదుర్కొంటుంది. నవంబర్ 14 నుంచి సౌతాఫ్రికా భారత్‌లో పర్యటిస్తుంది. ఈ పర్యటనలో భాగంగా తొలుత రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ జరుగుతుంది. అనంతరం మూడు వన్డేలు, ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ జరుగుతుంది.

స్కోర్లు...
ఇండియా : 518/5డిక్లేర్డ్, 124/3
వెస్టిండీస్ : 248, 390

శ్రీలంకXన్యూజిలాండ్ మ్యాచ్ వర్షార్పణం

కొలంబో: ఐసిసి మహిళల ప్రపంచకప్ మరో మ్యాచ్‌కు వర్షం అడ్డంకిగా నిలిచింది. శ్రీలంక–ఆస్ట్రేలియా జట్ల మధ్య 4న జరగాల్సిన మ్యాచ్ వర్షం పూర్తిగా తుడిచిపెట్టుకుపోగా.. తాజాగా శ్రీలంక–న్యూజిలాండ్ జట్ల మధ్య మంగళవారం జరగాల్సిన మ్యాచ్ కూడా ఒక ఇన్నింగ్స్ ముగిసాక వర్షం కారణంగా పూర్తిగా రద్దయ్యింది. ప్రేమదాస స్టేడియంలో న్యూజిలాండ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీలంక జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 258 పరుగులు చేసింది. లంక బ్యాటర్లు ఆటపట్టు, నీలాక్షి డిసిల్వా అర్థ శతకాలతో మెరిసారు. ఈ మైదానంలో ఇదే భారీ స్కోర్. శ్రీలంక ఇన్నింగ్స్ ముగిసాక చినుకులు మొదలవ్వడంతో సిబ్బంది పిచ్‌ను పూర్తిగా కవర్లతో కప్పేశారు. రాత్రి 9.30గం॥ల వరకు వర్షం తగ్గకపోవడంతో మ్యాచ్‌ను రద్దుచేస్తున్నట్లు ప్రకటించి ఇరుజట్లకు ఒక్కో పాయింట్ కేటాయించారు. నేడు ఇంగ్లండ్, పాకిస్తాన్ జట్ల మధ్య కొలంబో వేదికగా మ్యాచ్ జరగనుంది.

గుజరాత్, యుపి గెలుపు

న్యూఢిల్లీ: త్యాగరాజ్ ఇండోర్ స్టేడియంలో మంగళవారం జరిగిన ప్రొ కబడ్డీ పోటీల్లో గుజరాత్ జెయింట్స్, యుపి యోధాస్ జట్లు విజయం సాధించాయి. గుజరాత్ జట్టు 40–32పాయింట్ల తేడాతో పట్నా పైరెట్స్‌ను, యుపి జట్టు 32–31పాయింట్ల తేడాతో తమిళ్ తలైవాస్‌ను చిత్తుచేసాయి. **ప్రొ కబడ్డీలో నేడు..**

తెలుగు టైటాన్స్ X బెంగాల్ వారియర్స్(రాత్రి 7.30గం॥లకు)
జైపూర్ పింక్ ప్యాంథర్స్ X పుణేరి పల్టన్స్(రాత్రి 8.30గం॥లకు)
గుజరాత్ జెయింట్స్ X తమిళ్ తలైవాస్(రాత్రి 9.30గం॥లకు)



కరచాలనాలకు బ్రేక్.. హాకీ మ్యాచ్ ప్రారంభానికి ముందు భారత్-పాక్ ఆటగాళ్లు ఇలా..

భారత్, పాక్ హాకీ మ్యాచ్ డ్రా

సుల్తాన్ జొహార్ కప్

కౌలాలంపూర్: సుల్తాన్ జొహొర్ కప్‌లో భారత్, పాకిస్తాన్ ఆటగాళ్లు 'హై–ఫైవ్'తో కరచాలకు దుమారానికి బ్రేక్ వేశారు. ఇటీవల ఆసియాకప్ క్రికెట్ టోర్నీలో, ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో పాకిస్తాన్ ప్లేయర్లతో కరచాలనాలకు టీమిండియా ప్లేయర్లు దూరంగా ఉన్నారు. కానీ సుల్తాన్ జొహోర్ కప్‌లో ఆ విషయం గురించి ఇరువురు ఆటగాళ్లు పట్టించుకోలేదు. మంగళవారం భారత్–పాకిస్తాన్ జట్ల మధ్య జరిగిన లీగ్ మ్యాచ్ డ్రా అయ్యింది. నాలుగు క్వార్టర్స్‌కు ముగిసేసరికి ఇరుజట్లు 3–3గోల్స్‌తో సమంగా నిలిచాయి. తొలి క్వార్టర్‌లో పాక్ జట్టు 5వ ని.లో ఒక గోల్ చేయడంలో ఆ జట్టు 1–0 ఆధిక్యతలో నిలిచింది. రెండో అర్థభాగంలో ఇరుజట్లు గోల్స్ చేయలేదు. మూడో క్వార్టర్‌లో భారత్, పాకిస్తాన్ జట్లు ఒక్కో గోల్ కొట్టాయి. దీంతో మూడో క్వార్టర్ ముగిసేసరికి భారత్ 1–2గోల్స్‌తో వెనుకబడింది. కానీ నాల్గో, చివరి క్వార్టర్‌లో భారత్ ఏకంగా రెండు గోల్స్ కొట్టగా, పాక్ జట్టు మరో గోల్‌ను కొట్టి మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. అంతకుముందు న్యూజిలాండ్‌తో జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు 4–2గోల్స్ తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తుచేసింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68